



అక్షరాలా రూ.1537 కోట్లు

ఉమ్మడి జిల్లాలో కరెంటు బకాయిలు

- పంచాయతీరాజ్‌దే రూ.1427 కోట్లు
- అన్ని ప్రభుత్వ శాఖల బకాయిలు రూ.43 కోట్లు
- ప్రైవేటు బకాయిలు రూ.67 కోట్లు

ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు ఎస్పీడీసీఎల్‌కు గుదిబండగా మారాయి. ఉమ్మడి జిల్లాలో ప్రైవేటు బకాయిలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలవీ రూ.1537 కోట్లకుపైగా రావాల్సి ఉంది. ఏదో రెండో, మూడో శాఖలు తప్పిస్తే బిల్లుల చెల్లింపుల్లో ప్రధాన శాఖలన్నీ నిర్లక్ష్యంగా వ్యవహరించడం గమనార్హం.

మరోవైపు, విద్యుత్ ఉత్పత్తి, పంపిణీలో నష్టాలు వస్తున్నాయంటూ గత వైసీపీ ప్రభుత్వం కరెంటు ఛార్జీలను ఏడు సార్లు పెంచి సామాన్యులపై భారం మోపింది. జనంపై భారం మోపేందుకు ఏ మాత్రం ఆలోచించని ప్రభుత్వం ఎస్పీడీసీఎల్‌కు విద్యుత్ బిల్లులు చెల్లించడంలో మాత్రం అంతులేని నిర్లక్ష్యాన్ని చూపింది.

కరెంటు బిల్లుల చెల్లింపులో కాస్త ఆలస్యమైతే చాలు.. వినియోగదారులపై అపరాధ రుసుం విధిస్తారు. గడువులోపు చెల్లించకుంటే కనెక్షన్ తొలగించేస్తారు. మరి ప్రభుత్వ కార్యాలయాలు బిల్లులు చెల్లించకుంటే మాత్రం ఏం చేయాలో పాలుపోని పరిస్థితిలో ఉంది ఎస్పీడీసీఎల్. ఒక రూపాయి, రెండు రూపాయలు కాదు.. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాల నుంచి సుమారు రూ.1537 కోట్లు పైగా విద్యుత్ బకాయిలు చెల్లించాల్సి ఉంది. ఆయా శాఖలకు ప్రభుత్వం సక్రమంగా నిధులు కేటాయించి ఉంటే బిల్లులు చెల్లింపులో ఇంత జాప్యం ఉండేది కాదని అధికారులు అంటున్నారు. అధిక మొత్తంలో బకాయిలు ఉన్న కొన్ని శాఖల వివరాలు పరిశీలిస్తే... పంచాయతీరాజ్‌లో అత్యధికంగా రూ.1407 కోట్లు కాగా మున్సిపాలిటీల పరిధిలోని స్ట్రీట్‌లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.18 కోట్లు, కార్పొరేషన్ పరిధిల్లో పరిధిలోని స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లు రూ.9 కోట్లు, పంచాయతీ రాజ్ రూ.9 కోట్లు, విద్యాశాఖ రూ.8.5 కోట్లు, రెవెన్యూ రూ.6 కోట్లు, మెడికల్ అండ్ హెల్త్ రూ.4 కోట్లు బకాయిలు ఉన్నాయి.

పంచాయతీ నిధులను మళ్లించినా..

జగన్ ప్రభుత్వం వచ్చిన వెంటనే కరెంటు బిల్లుల కోసమని పంచాయతీల నిధులు మళ్లించేశారు. తద్వారా పది శాతం బిల్లులు మాత్రమే చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ.1407 కోట్ల బకాయిలున్నాయి. గత ఐదేళ్లల్లో వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేసింది. దీంతో పంచాయతీ భవనాలకు, మేజర్, మైనర్ పంచాయతీల్లో స్ట్రీట్ లైట్లు, వాటర్‌వర్క్‌లకు ఒక రూపాయి కూడా పంచాయతీలు చెల్లించలేక పోయాయి.

తలపట్టుకుంటున్న అధికారులు

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ శాఖలకు సంబంధించి 48645 సర్వీసులు ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.1470 కోట్లు, ప్రైవేటు(గృహ) సర్వీసులు 1337746 కాగా, ఇందులో ఎస్సీ, ఎస్టీ 117713 సర్వీసులకు సంబంధించి రూ.37 కోట్లు మొత్తం రెండు కలిసి మొత్తం రూ.1537 కోట్లు బకాయిలు మేర విద్యుత్ బకాయిలు ఉన్నాయి. వీటిని వసూలు చేయలేక తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వం నిధులు కేటాయిస్తే కదా తాము కట్టేందుకు అని అధికారులు వాపోతున్నారు. చేసేది లేక విద్యుత్ శాఖ అధికారులు ప్రభుత్వ శాఖలకు నోటీసులు ఇచ్చి తలలు పట్టుకొని కూర్చుంటున్నారు.

- చిత్తూరు రూరల్

కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్!

- టీడీపీలోకి ఐదుగురు కౌన్సిలర్లు, 14 మంది ఎంపీటీసీలు జంప్
- సీఎం చంద్రబాబు సమక్షంలో చేరిక



టీడీపీలో చేరిన గుడుపల్లె మండల ఎంపీటీసీలు

కుప్పం, జూలై 31: కుప్పంలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన నియోజకవర్గంలోని 14 మంది ఎంపీటీసీలు, ఐదుగురు కౌన్సిలర్లు టీడీపీలోకి జంప్ అయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో వారు పార్టీలో చేరి పసుపు కండువా కప్పుకొన్నారు. కుప్పం మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాలకు చెందిన ఎంపీటీసీలు మంగళవారం సాయంత్రం ఆయా మండలాల టీడీపీ నాయకులతో కలిసి విజయవాడకు చేరుకుని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌ను కలిశారు. బుధవారం ఉదయం చంద్రబాబు నివాసానికి చేరుకున్నారు. ఇక్కడ వైసీపీ ఎంపీటీసీలు, కౌన్సిలర్లకు చంద్రబాబు స్వయంగా పసుపు కండువాలు కప్పి, వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం వారితో సమావేశమయ్యారు. కుప్పం మున్సిపాలిటీకి చెందిన వైసీపీ కౌన్సిలర్లు రాజమ్మ, లావణ్య, హంస, సయ్యద్ అలీలు టీడీపీలో చేరారు. వీరిలో హంస, లావణ్య తరఫున వారి భర్తలు, రాజమ్మ తరఫున జగన్ చేరికల కార్యక్రమానికి హాజరయ్యారు. అలాగే గుడుపల్లె మండలంనుంచి వైసీపీకి చెందిన సోడిగానిపల్లె ఎంపీటీసీ లక్ష్మీదేవి, కొడతనపల్లె ఎంపీటీసీ వసమ్మ, గుండ్లసాగరం ఎంపీటీసీ శ్రీకాంత్, కుప్పిగానిపల్లె ఎంపీటీసీ వెంకటేశ్, పొగురుపల్లె ఎంపీటీసీ రాజేశ్వరి, బెగ్గిలపల్లె ఎంపీటీసీ వెంకటమ్మ టీడీపీలో చేరారు. కుప్పం మండలంలో మల్లానూరు-3, జరుగు, నడిమూరు ఎంపీటీసీలు తిమ్మరాయన్, శ్రీనాథ్, నారాయణలు, శాంతిపురం మండలంలోని కడపల్లె, అనికెర, 121-పెద్దూరు, మఠం, చిన్నారిదొడ్డి ఎంపీటీసీలు ఉమాదేవి, వనిత, రవికుమార్, చంద్రప్ప, బీఎన్.వెంకటేశ్‌లు కూడా చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరిలో మహిళా ఎంపీటీసీల తరఫున చాలావరకు వాళ్ల కాక, వారి భర్తలు హాజరయ్యారు. త్వరలోనే కుప్పం నియోజకవర్గంలోని మరికొందరు ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు కూడా టీడీపీలో చేరనున్నట్లు చెబుతున్నారు. రామకుప్పం మండలంనుంచి మూడు నాలుగు రోజుల్లో వైసీపీ ఎంపీటీసీలు పెద్దయెత్తున టీడీపీలో చేరనున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ సురేశ్‌బాబు, టీడీపీ కుప్పం మున్సిపల్, కుప్పం, గుడుపల్లె, శాంతిపురం అధ్యక్షులు రాజ్‌కుమార్, ప్రేమ్‌కుమార్, బాబునాయుడు, విశ్వనాథనాయుడు వీరితో పాటూ ఈ కార్యక్రమంలో ఉన్నారు.





కుప్పం మండల ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్లు - శాంతిపురం మండల ఎంపీటీసీలు

ప్రత్యేకాభివృద్ధి అధికారుల నియామకం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31: జిల్లావ్యాప్తంగా ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు, 31 మండలాలకు ప్రత్యేక అభివృద్ధి అధికారులను నియమిస్తూ కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు, పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. నియోజకవర్గాలవారీగా.. చిత్తూరుకు మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ చిన్నారెడ్డి, పూతలపట్టుకు బీసీ కార్పొరేషన్ ఈడీ బి.శ్రీదేవి, గంగాధరనెల్లూరుకు ఎస్ఎస్ఏ అసిస్టెంట్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పీఆర్ వెంకటరమణారెడ్డి, నగరికి జిల్లా వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, పలమనేరుకు జిల్లా పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్, పుంగనూరుకు ఉద్యానశాఖ డీడీ మధుసూదన్ రెడ్డి, కుప్పంకు బీసీ వెల్ఫేర్, ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ రబ్బాని బాషా నియమితులయ్యారు. మండలాలకు సైతం జిల్లా, మండల ముఖ్య అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా కలెక్టర్ నియమించారు.

మన డాక్యుమెంట్ల భద్రత ఎంత?

- వందేళ్లకు మించిన భవనాల్లో రికార్డులు
- నేడు అధికారులతో కలెక్టర్ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31: జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో కీలక డాక్యుమెంట్ల భద్రతపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఇటీవల అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ఘటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు, ఇతర విలువైన పత్రాల భద్రతపై దృష్టి పెట్టింది. చిత్తూరు జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ పరిధిలో ఉన్న 8 సబ్ రిజిస్ట్రర్ కార్యాలయాల్లో చిత్తూరు రూరల్, బంగారుపాళ్యం, కార్వేటినగరం, నగరి అద్దె భవనాల్లో చాలీచాలనీ గదుల్లో విలువైన రికార్డులు భద్రపరిచేందుకు సొంత భవనాలు లేకుండా కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రమైన చిత్తూరు రెవెన్యూ రిజిస్ట్రేషన్ కార్యాలయ రికార్డు గది 1860 నుంచి కొనసాగుతోంది. కుప్పంలో అప్పట్లో చంద్రబాబు చొరవతో సొంత భవనాన్ని ఏర్పాటు చేశారు. పలమనేరు, పుంగనూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు 1860-80 మధ్య నుంచి కొనసాగుతున్నాయి. పూర్తిగా భద్రత లేకుండా పోయింది. మరమ్మతులకు గత ప్రభుత్వం నయా పైసా విడుదల చేయలేదు. కొత్త భవన నిర్మాణాలకు నిధులు, స్థలం కేటాయించలేదు. ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే రిజిస్ట్రేషన్ శాఖ నుంచి ఆదాయం పిండుకోవడం మీద చూపిన శ్రద్ధ.. వాటి బాగోగుల మీద పెట్టలేదు. అధికారులు ఎన్నోసార్లు అప్పటి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఉషశ్రీ చరణ్, మంత్రి పెద్దిరెడ్డి తదితరులకు సొంత భవనాలకు స్థలాలు కేటాయించాలంటూ విన్నవించినా పట్టించుకోలేదు.

నేడు సమావేశం..

రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య డాక్యుమెంట్ల భద్రతపై దృష్టి పెట్టిన జిల్లా యంత్రాంగం గురువారం మధ్యాహ్నం 12 గంటలకు కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్యక్షతన సమావేశం కానుంది. కన్వీనర్‌గా జిల్లా రిజిస్ట్రార్ కే శ్రీనివాస్‌రావు, సభ్యులుగా ఆర్‌అండ్‌బీ, విద్యుత్తు, అగ్నిమాపకదళ జిల్లా అధికారులు ఉంటారు. సొంత, అద్దె భవనాల్లో కొనసాగుతున్న రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఉన్న విలువైన రికార్డుల భద్రతపై చర్చించనున్నారు. భవనాల తాజా పరిస్థితి, విద్యుత్ సరఫరా, కూలే స్థితిలో ఉన్నవాటి స్థానంలో సొంత భవనాల నిర్మాణాలు, స్థలం.. నిధుల కేటాయింపు గురించి ప్రభుత్వంతో చర్చించాల్సిన తీర్మానాలపై నిర్ణయం తీసుకోనున్నారు.



కుప్పంలో సీను రివర్స్

హోటల్ అమరావతిగా మారుతున్న వైసీపీ అద్దె కార్యాలయం

కుప్పంలో సీను మారుతోంది. వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు వెల్లువలా సాగుతున్నాయి. అందుకు సాక్ష్యం అన్నట్టుగా ఒకప్పుడు నీలి, పచ్చ రంగుల్లో, కార్యకర్తలతో కళకళలాడిన కుప్పం బైపాస్ రోడ్డులోని వైసీపీ కార్యాలయం.. హోటల్ అమరావతిగా కొత్తరూపం పోసుకుంటోంది. ఎన్నికల తర్వాత కార్యాలయం ఖాళీ అయిపోవడంతో భవన యజమాని ఉన్న భవనాలు కూల్చేసి హోటల్‌గా మార్చేస్తున్నారు. త్వరలో హోటల్ అమరావతి ప్రారంభం అంటూ ఫ్లెక్సీలు సైతం వేలాడదీశారు. ఆ దారిన వెళ్లేవారు మాత్రం ఈ మార్పు చూసి.. ఔరా.. ఎంతలో ఎంత మార్పు అని నిట్టూరుస్తున్నారు.

- కుప్పం



అధికారంలో ఉన్నప్పుడు వైసీపీ నేతలు, శ్రేణులతో సందడిగా ఉన్న పార్టీ కార్యాలయం



ఇప్పుడు.. కార్యాలయం గేటుకు వేలాడదీసిన హోటల్ అమరావతి పేరిట ఫ్లెక్సీలు

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనర్హత పిటిషన్‌పై విచారణ 5కు వాయిదా

పుంగనూరు జూలై 31: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత కేసు ఆగస్టు 5వ తేదికి వాయిదా పడింది. ఎన్నికల అఫిడవిట్‌లో 142 ఆస్తులు పేర్కొన లేదని, ఆయన్ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టులో బీసీవైపార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ పిటిషన్ వేశారు. దీనిపై ఆయన బుధవారం మాట్లాడుతూ.. ఈ కేసును హైకోర్టులో రాష్ట్ర బార్ కౌన్సిల్ అధ్యక్షుడు వైవీ రవిప్రసాద్ వాదనలు విన్న న్యాయమూర్తి ఎన్నికల్లో రెండవ స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డికి కూడా ఇంప్లీడ్ పిటీషన్ వేయాలని ఆదేశించారన్నారు. రెండో స్థానంలో ఉన్న టీడీపీ అభ్యర్థి ఇంప్లీడ్ అవ్వకపోయినా సెక్షన్ 82(2) ప్రకారం పిటిషనర్ కూడా అభ్యర్థిగా ఉన్నందున విచారణ కొనసాగించవచ్చునని న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. దీంతో జడ్జి కేసు విచారణను ఆగస్టు 5వతేదీకి వాయిదా వేసినట్లు ఆయన వివరించారు. ఎన్నికల కేసు విచారణ వేగం పెరిగిందని, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై అనర్హత వేటు పడేలా హైకోర్టుకు అన్ని రికార్డులు అందజేశామని చెప్పారు.





శ్రీకాళహస్తిలో బుధవారం సత్య ఏజెన్సీస్ 26వ బ్రాంచిని అధినేత స్వరూప్ మురారి ప్రారంభించారు. ఏపీ హెడ్ సెంథిల్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు పదవుల పందేరానికి ముహూర్తం సమీపిస్తోంది. కూటమి పార్టీల అధిష్ఠానాలు ఎంపిక ప్రక్రియపై కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం తర్వాత విడతల వారీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆగస్టు నెలాఖరులోపు సాధ్యమైనంత వరకూ మొత్తం పదవులు భర్తీ చేసే అవకాశం వుంది. దీంతో తిరుపతి జిల్లాలో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి. రెండేళ్ల తర్వాత పరిస్థితులు ఎలా వుంటాయోనని తొలి విడతలోనే ఛాన్సు కొట్టేయాలని ఆశావహులు ఆరాటపడుతున్నారు. దీంతో చివరి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వీరీ.. వీరీ.. గుమ్మడి పండూ..

వీరికే పదవి?

ఈ నెలలోనే నామినేటెడ్ పదవుల పందేరం

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధిష్ఠానాలు

కూటమి పార్టీల అధిష్ఠానాలు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. టీడీపీ విషయానికొస్తే నియోజకవర్గం నుంచీ వందమంది పేర్లను అప్‌లోడ్ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచీ 80 వరకూ పేర్లు అధిష్ఠానానికి అందాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా 100-150 పేర్లు పంపించాల్సి వుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కష్టపడిన వారి జాబితా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా జిల్లా అధ్యక్షుడికే అప్పగించినట్టు సమాచారం. ఇప్పటి వరకూ తిరుపతి నుంచీ 90 పేర్లు అప్‌లోడ్ అయ్యాయని చెబుతున్నారు. జనసేన పార్టీలో కూడా ఇదేరకమైన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పేర్లు ముందుపెట్టుకుని వారి స్థాయిని బట్టి స్థానికంగా ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్లుగా, మార్కెట్ కమిటీలలో డైరెక్టర్లుగా, ఛైర్‌పర్సన్లుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

అందరి గురీ టీటీడీ, తుడాలపైనే!

టీటీడీ బోర్డు ఛైర్మన్, మెంబరు పదవులపైన, తుడా ఛైర్‌పర్సన్ పదవిపైనా ఎక్కువమంది ఆశావహులు గురి పెడుతున్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి రాష్ట్రస్థాయిలో కీలకం కావడంతో జిల్లానుంచీ ఒకరిద్దరు మాత్రమే ఆశిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తాను గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసినందున ఈ పర్యాయం టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని, తిరుపతి ప్రాంత యాదవులతో శ్రీవారి ఆలయానికి వున్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో వుంచుకుని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. తన వయసు దృష్ట్యా రాజకీయంగా ఇదే తనకు చివరి అవకాశమని గుర్తు చేస్తున్నారు. టీటీడీ ప్రయోజనాల కోసం పోరాడిన నేపథ్యం కలిగిన తనను ఛైర్మన్‌గా నియమించాలని బీజేపీ నేత భానుప్రకాశ్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. వీరిద్దరే బాహాటంగా టీటీడీ ఛైర్మన్ పదవి కోరుతున్నారు.

టీటీడీ మెంబరు కోసం 300 దరఖాస్తులు

టీటీడీ బోర్డు మెంబరు పదవి కోసం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబుకు ఇప్పటి వరకూ 300 దరఖాస్తులు అందినట్టు సమాచారం. మూడు పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం కావడం వల్ల చంద్రబాబుపై టీటీడీలో మెంబరు పదవుల కోసం మూడు పార్టీల నుంచీ విపరీతమైన ఒత్తిడి వుంది. 24 మందిని మాత్రమే నియమించే వీలున్నందున ఆశావహులను వడపోయడం సంక్లిష్టంగా మారిందని సమాచారం. జిల్లాకు లేదా తిరుపతికి కనిష్టంగా ఒకటి లేదా గరిష్టంగా రెండు మెంబరు పదవులకు మించి కేటాయించే అవకాశం లేదు. ఒత్తిడి ఎక్కువైతే ఒక్కటి కూడా ఇవ్వకపోయినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. జిల్లా నుంచీ బోర్డు మెంబరు కావాలని చాలామంది ఆశిస్తున్నారు. టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, హేమాంబరధర రావు, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అలాగే జనసేన నుంచీ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఈ పదవి కోసం రేసులో వున్నారు. బీజేపీ నుంచీ ఛైర్మన్ పదవి రాకపోతే మెంబరు పదవి ఇవ్వాలని భానుప్రకాశ్‌రెడ్డి కోరుతుండగా సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పేర్లు కూడా పరిశీలనలో వున్నాయి. వీరిలో పలువురు గత ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు. అలాగే కొందరు తమ పార్టీల కోసం కష్టకాలంలో ఆర్థిక భారం కూడా వహించారు.

తుడా ఛైర్మన్ పదవికి పలువురు ఆశావహులు

టీటీడీలో ఎక్స్ అఫిషియో మెంబరు హోదా కలిగిన తుడా ఛైర్మన్ పదవిని సైతం పలువురు నేతలు ఆశిస్తున్నారు. బ్రహ్మాండమైన కార్యాలయం, సిబ్బంది, వనరులు, క్యాబినెట్ హోదా కలిగిన పదవి కావడంతో ఈ పదవికి క్రేజ్ పెరిగింది. ఈ పదవికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, చంద్రగిరి నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్, తిరుపతి నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రవినాయుడు తనకు అవకాశం ఇస్తే సామాన్య కార్యకర్తను గుర్తించినట్టు అవుతుందని, యువతను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ కష్టపడి పనిచేశానని, యువగళం పాదయాత్రలోనూ, అలాగే అధినేత సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలోనూ వెన్నంటి నడిచానని చెబుతున్నారు. బడి సుధా యాదవ్ చంద్రగిరి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించగా దివాకర్‌రెడ్డి శ్రీకాళహస్తి, చంద్రగిరిల్లో పార్టీ కోసం పనిచేశారు. దేవనారాయణరెడ్డి తిరుపతి, చంద్రగిరి సెగ్మెంట్లలో పార్టీ కోసం పనిచేశారు. వీరిలో రవినాయుడు, సుధా యాదవ్, దేవనారాయణరెడ్డి పార్టీ కోసం పలు పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొన్నారు. జనసేన నుంచీ హరిప్రసాద్, కిరణ్ రాయల్ టీటీడీ బోర్డు మెంబరు కాకుంటే తుడా ఛైర్మన్ పోస్టు అయినా దక్కుతుందని ఆశిస్తున్నారు. వారిలో కిరణ్ రాయల్ గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు.

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం సమీపించడంతో ఆశావహుల యత్నాలు జోరందుకున్నాయి. పలువురు నేరుగా తమ పార్టీల అధినేతలను కలుస్తున్నారు. ఆయా పార్టీల కోసం తాము అందించిన సేవలను గుర్తు చేస్తూ, పార్టీల కోసం తాము పడిన కష్టాలను ఏకరువు పెడుతున్నారు. తమకు ఫలానా పదవి కావాలని కొందరు సూటిగా ప్రస్తావిస్తుండగా మరికొందరు ఫలానా పదవి ఇవ్వాలని అది లేకుంటే ప్రత్యామ్నాయంగా ఫలానా పదవి ఇవ్వాలని అధిష్ఠానాల ఎదుట ప్రతిపాదనలు పెడుతున్నారు. కొందరైతే ఏ పదవి ఇచ్చినా పర్వాలేదని అధిష్ఠానాలకే వదిలి పెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా పార్టీ పదవులు

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పదవులు తెరపైకి వస్తున్నా యి. టీడీపీలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంఛార్జి పదవులతో ఇద్దరిని సమాధానపరిచే అవకాశం కనిపిస్తోంది. అధికారంలో వున్నందున పార్టీ పదవులు తీసుకునేందుకు కొందరు సిద్ధంగా వున్నారు. అయితే వట్టి పార్టీ పదవులే అయితే తమకు అధికారులు విలువ ఇవ్వరని, ఏదో ఒకటి ప్రోటోకాల్ పదవి కూడా అనుబంధంగా ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. ఇదే పరిస్థితి జనసేన పార్టీలోనూ కనిపిస్తోంది. ఆశావహుల్లో ఎవరో ఒకరిని జిల్లా అధ్యక్ష పదవితో సంతృప్తిపరిచే అవకాశముంది.

జిల్లాలో భర్తీకి అవకాశం వున్న పదవులు ఇవీ!

తిరుపతి జిల్లాలో టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, బోర్డు మెంబర్లు, తుడా ఛైర్ పర్సన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు కీలకమైనవి.ఇందులో టీటీడీ ఛైర్మన్ నిస్సందేహంగా రాష్ట్రస్థాయి పదవి. తుడా ఛైర్‌పర్సన్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు క్యాబినెట్ ర్యాంకు కలిగినవే అయినా వాటిని జిల్లాస్థాయి పదవులుగానే పరిగణించే పరిస్థితి. తర్వాత కేటగిరీలో , ముక్కంటి, చెంగాలమ్మ, సురుటుపల్లి, వెంకటగిరి పోలేరమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తదితర ముఖ్య ఆలయాల పాలక మండళ్ళు, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పదవులున్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్ళు వున్నాయి. ముక్కంటి ఆలయం మొదలుకుని ఇవన్నీ స్థానిక ప్రాధాన్యత కలిగిన పదవులు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, వాటిల్లో డైరెక్టర్ పదవులు కూడా కొన్ని జిల్లాకు దక్కే అవకాశముంది. వివిధ అకాడమీలు, వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, మహిళ, ఎస్సీ, మైనారిటీ కమిషన్ల ఛైర్‌పర్సన్ పదవులు, వాటిలో డైరెక్టర్ పదవులు వంటికి కూడా కొన్ని జిల్లా నేతలకు దక్కవచ్చు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

చిత్తూరు, జూలై 31: డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను ఏలూరు నగర డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కుప్పం డీఎస్పీగా ఉన్న శ్రీనాథ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న పార్థసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్ఎంసీ ఎన్నికలకు మోగిన నగారా

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేయనుంది. రెండేళ్ల కాలపరిమితితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయడం, ఫిర్యాదులుంటే పరిష్కరించడం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలకు తుది ఓటరు జాబితా ఖరారు, నోటీసు బోర్డులో ప్రదర్శన ఉంటుంది. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), జులై 31: సామాజిక పెన్షన్ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లాలోని 2,70,619 మంది లబ్ధిదారులకు అవసరమైన రూ.114.10 కోట్లు విడుదలయ్యాయి. బ్యాంకుల ద్వారా ఈ మొత్తం గ్రామ, వార్డు సచివాలయాలకు చేరాయి. సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ చేయనున్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికివెళ్లి నేరుగా అందించనున్నారు.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన రెండవనెల పెన్షన్ల పంపిణీ జరగనుంది. పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయనున్నారు.జిల్లాలోఅత్యధికంగా 1.44లక్షలమంది వృద్ధాప్య పెన్షనర్లు ఉండగా, 59,903 మంది మంది వితంతువులు, 35,732 మంది వికలాంగులు, 11,470 మంది అభయహస్తం, 6375 మంది డప్పు కళాకారులు, 5747 మంది ఒంటరి మహిళలు, తదితర వర్గాలకు చెందిన వారు ఉన్నారు.

బాల కార్మిక రహిత జిల్లానే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31: బాల కార్మికుల రహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో పుల్లయ్య అన్నారు. బుధవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన డీఆర్వో మాట్లాడుతూ 14 సంవత్సరాలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసుతో పాటు జరిమానా ఉంటాయని తెలిపారు. బాలకార్మికులు పనిచేస్తున్నట్లు తెలితే 1098కి కాల్‌చేసి తెలియజేయాలన్నారు. గురువారం నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో దేవరాజులు, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్, నాగమణి, పిల్లల సంరక్షణ అధికారి శివ, సహాయ కార్మిక అధికారి మధుబాబు పాల్గొన్నారు.

పెద్దూరు సర్పంచి చెక్ పవర్ రద్దు

రామకుప్పం, జూలై 31: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ సర్పంచి మల్లిక చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో ఈమె అందుబాటులో లేకపోవడం వల్ల తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నట్టు జూలై 18న పలువురు గ్రామస్థులు జిల్లా అధికారులకు పిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచు మల్లికపై తగు చర్యలు తీసుకుని, నిధులు డ్రా చేసే అధికారాన్ని నిషేధించాలని కోరారు. దీనిపై విస్తరణాధికారి నివేదిక మేరకు సర్పంచుకు నిధులు డ్రా చేసే అధికారం నుంచి తప్పించినట్టు డీపీవో తమ అదేశాల్లో పేర్కొన్నారు. కుప్పం ఉపఖజానా అధికారి, వి.కోట స్టేట్‌బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకుల వారు 89పెద్దూరు పంచాయతీకి సంబంధించి నిధుల విషయంలో కలెక్టరు జారీ చేసే చెక్కులను మాత్రమే అనుమతించాలని ఆ ఆదేశాల్లో ఆమె పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



పుంగనూరు రూరల్, జూలై 31: తాగునీటి సమస్య పరిష్కరించాలని పుంగనూరు టిట్కో ఇళ్ల మహిళలు ఖాళీబిందెలతో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 15 రోజులుగా తాగునీరు రావడం లేదని, తాము కూలీ పనులకు వెళ్లి సంపాదించిన డబ్బుతో తాగునీరు కొనుగోలు చేస్తున్నట్లు వాపోయారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి మున్సిపల్ అధికారులు, సిబ్బందిని పంపించి పైపుల మరమ్మతు పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీ వాసులు కమిషనర్‌ను అభినందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రైతులు ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలి : కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, జూలై 31: రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని లాభాల బాటలో పయనించాలని కలెక్టరు సుమిత్‌కుమార్, కడా పీడీ వికాస్‌మర్మత్ కోరారు. బుధవారం రామకుప్పంలో ఉద్యానరంగంలో విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, అధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో రైతులకు పంటల సాగులో ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహాలను, బ్యాంకు రుణాలు పొందడం, మంచి మార్కెటింగ్ సౌకర్యం వంటి వాటిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు 18రకాల ఉద్యానపంటలు, 12రకాల వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారన్నారు ఆగస్టు 10న కుప్పం కడా కార్యాలయంలో పీడీ అందుబాటులో ఉంటారన్నారు. బ్యాంకు రుణాలు, ప్రస్తుతం చేస్తున్న వృత్తి వివరాలు, ఆదాయమార్గాలు, ఏ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చెందాలనుకుంటున్నారో వంటి వివరాలను రైతులు స్వయంగా అందించాలని వారు కోరారు. కుప్పంలో పండించే పండ్లు, కూరగాయాల ప్రాసెసింగ్, ప్రాసెస్‌ల మార్కెటింగ్ వంటి అంశాలపై పరిశీలిస్తామని వారు తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ పీడీ శ్రీనివాసులు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, బ్యాంకు రుణాలు పొందడం, పారిశ్రామిక, సాంకేతిక సలహాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందిచే రుణాలను గూర్చి రైతులకు వివరించారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ హరీష్, ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, నియోజక, మండల అధ్యక్షులు చలపతి, కొళ్ళపల్లెబాబు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంసీ మాజీ ఛైర్మెన్, వైస్‌చెర్మన్లు సత్యేంద్రశేఖర్, సీతాపతి, బీజే పీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 31: ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. బుధవారం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అపార్టుమెంట్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నేర ఛేదనలో, ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, సెబ్ ఏఎస్పీ సుబ్బారావు, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించని టెండర్‌దారులపై చీటింగ్ కేసు పెట్టాలి


మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, జూలై31: వైసీపీకి చెందిన వ్యక్తులు మున్సిపాలిటీలో వివిధరంగాల్లో వేలం పాటల ద్వారా టెండర్లు పొంది సొమ్ము చెల్లించకుండా మోసం చేసిన వారిపై చీటింగ్ కేసులు పెట్టి రికవరీ చేయాలని కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీం బాషా అధ్యక్షతన కౌన్సిల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణమరాజు మాట్లాడుతూ వేలం పాటల ద్వారా పన్నులు వసూలు చేసి బకాయి ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు బకాయిదారులకు సహకరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే బకాయిదారులకు నోటీసులు అందజేశామని, ఇటీవల రూ.8లక్షలు వసూలైందని, దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ భూములు, కాల్వల ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఛైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సహకారంతో పుంగనూరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. కాగా వైసీపీకి చెందిన ఛైర్మన్‌తోసహా 13మంది ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్ మీట్‌కు వైసీపీ సభ్యులంతా గైర్హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిలర్లు అమ్ము, మనోహర్, నరసింహులు, మమత, నయింతాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో కలెక్టర్‌కు 83 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, కడా పీడీ తదితరులు

కుప్పం, జూలై 31: కుప్పంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక మండల సచివాలయంలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ వేదికలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన సమస్యలపై మొత్తం 83 పిర్యాదులు ప్రజలనుంచి అందాయి. ఇందులో రెవెన్యూ సంబంధిత పిర్యాదులు మాత్రమే ఏకంగా 62 ఉండడం గమనార్హం. ఇవిగాక హౌసింగ్ 6, పశు సంవర్ధక శాఖ 4, బీసీ కార్పొరేషన్ 3, ఐసీడీఎస్, ద్రావిడ విశ్వవిద్యాలయం రెండేసి, డీఎస్పీ, పోలీసు, స్కిల్ డెవలప్‌మెంట్, మండల పరిషత్తు, తపాలా శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకూ సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వారం రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో జి.శ్రీనివాసులుతోపాటు నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

నాడు ఈవో ధర్మారెడ్డి ఏకపక్షంగా తొలగించారు

హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్

కౌంటర్ దాఖలుకు దేవదాయ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదావేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణ దీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే చర్యలు : డీపీవో


మంగళంపేట డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీపీవో లక్ష్మి

కల్లూరు, జూలై 31: గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం పట్ల అలసత్వం వహిస్తే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి హెచ్చరించారు. పులిచెర్ల మండలం కల్లూరు, మంగళంపేట, ఎల్లంకివారిపల్లి, కావేటిగారిపల్లి, 106 రామిరెడ్డిగారిపల్లి పంచాయతీల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నిత్యం పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. డంపింగ్ యార్డులను వాడుకలోకి తీసుకురావాలని, చెత్త నుంచి సంపద సృష్టించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఆర్‌సీ షణ్ముగం, ఈవోపీఆర్‌డీ యుగంధర్, కార్యదర్శులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన

బైరెడ్డిపల్లె, జూలై 31 : వెంగంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో బుధవారం బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి వ్యక్తిగతశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చేతులశుభ్రత, పోషకాహార ప్రాముఖ్యత, పరిసరాల శుభ్రత, దోమల నివారణ, ఆరోగ్యరక్షణకు తీసుకోవాల్సిన ముందుజాగ్రత్త చర్యల గురించి వివరించారు. అలాగే రఘునాయకులదిన్నెలో కుష్ఠువ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యాధికారి డాక్టర్ విజయచందర్ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. సీజనల్‌వ్యాధుల నివారణ, అతిసార నివారణ గురించి వివరించారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


కీలపట్ల ఆలయ ప్రాముఖ్యతను తెలుసుకుంటున్న విద్యార్థులు

గంగవరం, జూలై31: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రకాల విభాగాల ప్రాముఖ్యతను తెలుసుకోవాలని గంగవరం కేజీబీవీ ఎస్వో రోహిణి పేర్కొన్నారు. బుధవారం గంగవరం కేజీబీవీ విద్యార్థులకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో భాగంగా ఫీల్డ్ విజిట్ నిర్వహించారు. కీలపట్లలో వెంకటేశ్వరస్వామి ఆలయం, గ్రామ సచివాలయ సేవలు, గంగవరం ఆరోగ్యకేంద్రంలో వైద్యసేవలు, అంటువ్యాధుల నివారణకు చేపట్టే కార్యక్రమాలు, పట్టుపరిశ్రమలో మల్బరీసాగు, పట్టుపురుగుల పెంపకం, వ్యవసాయ పనులు చేసే విధానంపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. పలమనేరు ఫైర్‌స్టేషన్‌లో సిబ్బంది నిర్వహించే విధులు, అగ్నిప్రమాదాలు, విపత్తులు సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది చేసే సాహసోపేత సేవలు, గంటావూరు వద్ద అందమైన మట్టిపాత్రలు తయారీ విధానంపై అవగాహన కల్పించారు. పీఈటీ తరణుమ్ తాజ్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ



సోమల, జూలై 31: మండలంలోని బూడిదేటివారిపల్లె, ఎర్రనాగులపల్లె, ఇరికిపెంట దళితవాడల్లో బుధవారం ఎమ్మార్పీఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టులో త్వరలోనే ఒక తీర్పు వెలుబడుతుందని నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు నరేంద్రబాబు, మురళి, రామనాథం, నరసింహులు, ప్రభుకుమార్, ప్రకాశ్, రవి, శుభకర్, మొగిలీశ్వర్, నాగభూషణం, సురేంద్ర, ప్రభు,రాయుడు పాల్గొన్నారు.

నర్సింగ్ వృత్తి బాధ్యతాయుతమైంది



గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభిస్తున్న వైద్య ప్రముఖులు

కుప్పం, జూలై 31: నర్సింగ్ వృత్తి గౌరవ ప్రదమైనదే కాక, ఎంతో బాధ్యతా యుతమైనదని కడప ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమగిరి అన్నారు. కుప్పంలోని పీఈఎస్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ 15వ బ్యాచ్ గ్రాడ్యుయేషన్ డే బుధవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ హేమగిరి మాట్లాడుతూ రోగులపట్ల సహనం, ప్రేమ చూపాలన్నారు. పీఈఎస్ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్.ఆర్. కృష్ణారావు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అభిరామి, పీఈఎస్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.సుబ్రమణ్య మాట్లాడుతూ విద్య, శిక్షణల ద్వారా పొందిన విలువలను కొనసాగిస్తూ సమాజానికి నిస్వార్థ సేవ చేయాలని ఉద్బోధించారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలి

కుప్పం, జూలై 31: పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అన్నారు. కుప్పం పురపాలక సంఘం 1, 2 వార్డుల సిబ్బంది, మెప్మా సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. సిబ్బంది వార్డులు తిరిగి చెత్తను ఎక్కడంటే అక్కడ పడేయకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకంగా చెత్త బుట్టల్లో వేసిన చెత్తను మున్సిపల్ ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా సిబ్బంది సేకరించి డంపింగ్ యార్డుకు చేరుస్తాయని చెప్పారు. అలాగే నీళ్ల నిలువ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో మెప్మా సీవోలు జగదీశ్, శోభ, సభ్యులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో మౌలిక వసతులు కరువు : టీడీపీ

పుంగనూరు రూరల్, జూలై31: పుంగనూరు పట్టణాభివృద్ధి జరిగినట్లు వైసీపీ ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప పట్టణంలో ఎక్కడ చూసినా సమస్యలున్నాయని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీకాంత్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని రాంనగర్ కాలనీవాసులతో కలిసి మున్సిపల్ కమిషనర్‌కు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు ఆయన మాట్లాడుతూ కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉన్నా పాలకవర్గం పట్టించుకోలేదని, మురుగు కాల్వల్లో ఎక్కడ చూసినా చెత్త మురుగుతో దుర్వాసన వెదజల్లుతోందని మండిపడ్డారు.

సీసీ రోడ్డు పనుల ప్రారంభం

వి.కోట, జూలై31: మండల పరిధిలోని గ్రామీణ ప్రాంతాల రహదారులకు కూటమి ప్రభుత్వ హయాంలో మహర్దశ పట్టనుందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి బి.ఆర్.రాంబాబు అన్నారు. వి.కోట మండలం యాలకల్లు పంచాయతీ ఎం.ఎం.కుంట గ్రామానికి ఈపీవీ నిధుల ద్వారా మంజూరై అర్థాంతరంగా ఆగిన సీసీ రోడ్డు పనులను తిరిగి ప్రారంభించారు. కల్లుపల్లె రహదారి నుంచి గ్రామానికి వెళ్ళే రోడ్డు రూ. 76 లక్షల వ్యయంతో కిలోమీటరు మేరా రహదారి నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ విశ్వనాథ్, మాజీ ఎంపీటీసీ సుబ్రమణ్యంశెట్టి, యూనిట్ ఇన్‌ఛార్జ్ హరినాథరెడ్డి, పంచాయతీ పార్టీ అధ్యక్షుడు తేజకుమార్, నేతలు రవికుమార్, శ్రీనివాసులు, జయప్ప, నవాబ్, ఇబ్రహీం, బావాజాన్, శంకరప్ప ఇతర నేతలు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

చురుగ్గా జనసేన పార్టీ సభ్యత్వ నమోదు

బైరెడ్డిపల్లె, జూలై 31 : జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నియోజకవర్గంలో చురుగ్గా జరుగుతున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పసుపులేటి దిలీప్ తెలిపారు. గత యేడాది నియోజకవర్గంలో 1500 మంది పార్టీలో సభ్యులుగా నమోదు చేసుకున్నారని, ప్రస్తుతం 2500పైగా సభ్యత్వాలు నమోదైనట్లు చెప్పారు. ఇందులో అత్యధికంగా బైరెడ్డిపల్లె మండలంలో 750కిపైగా సభ్యత్వాలు జరిగినట్లు తెలిపారు. జనసేన సభ్యులకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆస్పత్రి ఖర్చులకుగాను రూ. 50వేలు, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి పార్టీ తరపున రూ.5లక్షలు ఆర్థికసాయం అందజేస్తారన్నారు. ప్రస్తుతం జరుగుతున్న నూతన సభ్యత్వనమోదు కార్యక్రమం ఆగస్టు 5వ తేది వరకు పొడిగించినట్లు వివరించారు.

నేడు ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

కల్లూరు, జూలై 31: పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడుతున్నట్లు ఎంఈవో శిద్ధరామయ్య తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన అనంతరం ఓటర్ల జాబితా ప్రదర్శన ఉంటుందన్నారు. 5వ తేదీన ఓటర్ల జాబితా అభ్యంతరాలను స్వీకరించడం, వాటిని పరిష్కరించడం, ఆదే రోజు తుది ఓటర్ల జాబితా ప్రదర్శన ఉంటుందన్నారు. 8వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. అనంతరం కమిటీ సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్ చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు. ఆదేరోజు మొదటి స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహిస్తారని ఎంఈవో తెలిపారు.

గెస్ట్ టీచర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

సదుం, జూలై 31: పులిచెర్ల(బాలికలు), పెద్దపంజాణి గురుకుల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న అతిథి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్, సదుం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీషు, గణితం, భౌతిక, జీవశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నట్లు ఆయన తెలిపారు. పీజీతోపాటు సంబంధిత సబ్జెక్టులలో బీఈడీ అర్హత కలిగిన అభ్యర్థుల అర్హులన్నారు. ఈనెల 5వ తేదీలోపు సదుం గురుకుల కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని తెలిపారు. వివరాలకు 9000317307 నెంబరులో సంప్రదించాలన్నారు.

కుప్పం డీఎస్పీగా పార్థసారథి



కుప్పం, జూలై 31: కుప్పం డీఎస్పీగా బి.పార్థసారథి రానున్నారు. విజయవాడ సీఎస్‌బీ నుంచి ఆయనను ఇక్కడకు బదిలీ చేస్తూ డీజీపీ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు విడుదల చేశారు. కుప్పంలో డీఎస్పీగా పని చేస్తున్న బి.శ్రీనాథ్ ఇప్పటికే ఇంటలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే.

గంగవరం సీఐకు ప్రశంసాపత్రం



గంగవరం, జూలై 31 : జీవాల చోరీ కేసును ఛేదించి సుమారు రూ.9.50 లక్షల విలువైన సొత్తును రికవరీ చేసిన ఘటనలో గంగవరం సీఐ చిన్నగోవిందును అభినందిస్తూ ఎస్పీ మణికంఠ చందోలు బుధవారం చిత్తూరులో ప్రశంసాపత్రాన్ని బహూకరించారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి సకాలంలో కేసు ఛేదించడంతో ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రం అందించారు.

హెల్మెట్ ధరించాలి

సోమల, జూలై 31: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రయాణం సాగించాలని ఎస్ఐ శంకర్ తెలిపారు. బుధవారం స్థానిక బస్టాండ్‌లో హెల్మెట్ లేని వాహనదారులకు పలు సూచనలు చేశారు. అలాగే మైనర్ పిల్లలు వాహనాలు నడపరాదన్నారు. వాహనదారులు తమ రికార్డు అన్ని వేళల అందుబాటులో పెట్టుకుని ప్రయాణం సాగించాలని చెప్పారు. హెడ్ కానిస్టేబుల్ దేవరాజులు, రిజ్వాన్, రమణ పాల్గొన్నారు.

బెల్ట్ షాపులను అరికట్టండి

రొంపిచెర్ల, జూలై31: నియోజకవర్గంలో బెల్ట్ షాపులు అరికట్టాలని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం రొంపిచెర్లలోని ఆయన ఇంటి వద్ద ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి, ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో కలిసి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. చల్లాబాబు మాట్లాడుతూ మద్య దుకాణాల్లో అధిక ధరలకు విక్రయాలు జరగకుండా చూడాలన్నారు.

3న రొంపిచెర్ల మండల సమావేశం

రొంపిచెర్ల, జూలై 31: ఈనెల 3వ తేదీన ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో రెడ్డెప్పఆచారి తెలిపారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

వీధి కళాకారులకు సన్మానం



పలమనేరు, జూలై31 : పలమనేరులో రెండురోజులుగా వీధుల్లో సైకిల్‌పై పలు రకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్న వీరబ్రహ్మేంద్ర సైకిల్ సర్కస్ కళాకారులకు యోగా గురువు నందగోపాల్, సామాజిక కార్యకర్త మధుమోహన రావు శాలువా కప్పి సన్మానించారు. తరతరాలుగా వస్తున్న ఈ కళపైనే తాము జీవనం సాగిస్తున్నామని, రోజుకొక ఊరు వెళ్లి అక్కడ తాము నేర్చుకొన్న విన్యాసాలను ప్రదర్శిస్తూ ప్రేక్షకులు ఇచ్చే కొద్దిపాటి చిల్లర డబ్బులతో తాము జీవనం సాగిస్తున్నామని కళాకారులు తెలిపారు.

ఆలయ హుండీ లెక్కింపు



పలమనేరు, జూలై31 : పలమనేరు సమీపంలోని టి.ఎస్. అగ్రహారం కొండపై వెలిసిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో హుండీని బుధవారం ఎండోమెంట్ అధికారులు, భక్తుల సమక్షంలో లెక్కించారు. ఆడికృత్తిక సందర్భంగా ఆలయంలో అధికారులు హుండీలను ఏర్పాటు చేశారు. బుధవారం హుండీలను లెక్కించగా భక్తులు కానుకల రూపంలో రూ.4,12,737 వేసినట్లు అధికారులు తెలిపారు.

ఎంపీడీవోకు సత్కారం



చౌడేపల్లె, జూలై31: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శివప్రసాద్ పదవీ విరమణ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఈవోఆర్డీ కృష్ణవేణి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి చౌడేపల్లెకు బదిలీపై వచ్చిన ఆయన అందరిని కలుపుకోలుగా విధులు నిర్వహించారని కొనియాడారు. అనంతరం శాలువాలతో సత్కరించారు ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ, కార్యదర్శులు,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిపట్లలో ఆడికృత్తిక ఉత్సవాలు


నెల్లిపట్లలో సుబ్రమణ్యస్వామి పూజలు

బైరెడ్డిపల్లె,జూలై31:మండలంలోని నెల్లిపట్ల దేవరకొండపై వెలసిన సుబ్రమణ్య స్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలు బుధవారం రాత్రి శయనోత్సవంతో ముగిసాయి. అర్చకులు స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేకపూజలు జరిపి విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే స్వామివారికి వసంతోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

ఘనంగా వసంతోత్సవం


ఉత్సవమూర్తులకు వసంతోత్సవం

సోమల,జూలై31: సోమల బంగారు తిరుత్తణి కొండపై కొలువైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాల్లో భాగంగా బుధవారం వసంతోత్సవం, ధ్వజావరోహ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి పుష్ప కావిళ్లతో భక్తులు వచ్చి బంగారు తిరుత్తణి ఆలయంలో పూజలు జరిపి మొక్కులు తీర్చుకున్నారు. విశ్వహిందూ పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల హరికథలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల నిర్వాహకులు మేల్నాటి రఘుపతి పద్మావతమ్మ, సుబ్రహ్మణ్యం, పూల మురళీ కృష్ణ, శ్రీదేవి, పాగొండ వేణుగోపాల్ భక్తులకు అన్నదాన, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయకమిటీ సభ్యులు కళాకారులను సన్మానించారు.

గురుకుల బాలికలకు మెరుగైన వసతులు కల్పించాలి

పులిచెర్ల గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన చల్లా బాబు


గురుకుల పాఠశాల సిబ్బందిని ప్రశ్నిస్తున్న చల్లా బాబు

కల్లూరు, జూలై 31: బీసీ బాలికల గురుకుల పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించాలని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి ఆదేశించారు. పులిచెర్లలోని మహాత్మా జ్యోతీబాపూలే బాలికల గురుకుల పాఠశాలను బుధవారం చల్లా రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు పాఠశాలలో మరుగుదొడ్లు, వంటగది, డైనింగ్ హాలు, తరగతి గదులు, ప్రహరీ, తాగునీరు తదితర వాటిని పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని మౌలిక వసతుల కల్పనపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు సరిపడే తరగతి గదులు లేవని, వసతి సౌకర్యం అంతంతమాత్రంగా ఉందని, డ్రైనేజీ వ్యవస్థ సరిలేదని చల్లా దృష్టికి ప్రిన్సిపాల్ సునీత తీసుకెళ్లింది. దీనిపై స్పందించి ఆయన మాట్లాడుతూ వంట గది, డైనింగ్ హాలును ప్రత్యేక భవనంలోకి మార్చాలన్నారు. డ్రైనేజి వ్యవస్థ వెంటనే సరిచేయాలని, మరుగుదొడ్లను నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థుల పట్ల స్నేహభావంతో మెలగాలని, నాణ్యమైన విద్యను అందించాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, ఎంపీడీవో సురేష్‌బాబు, పీఆర్ డీఈ మురళి, ఏఈ నాయక్, త్యాగరాజు, ఏపీవో షౌకత్ ఆలీ, ఎంఈఓలు శిద్ధరామయ్య, పోకల తాతయ్య, సర్పంచ్‌లు షకూర్, రాణెమ్మ, ఎంపీటీసీ సభ్యులు రెడ్డిబాబుల్లా, రాశిప్రసాద్, సింధురవి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం

చౌడేపల్లె : టీడీపీ కార్యకర్తలతో చల్లా రామచంద్రారెడ్డి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బుధవారం ఆయన టీడీపీ కార్యకర్త కార్తీక్ తండ్రి, విశ్రాంత ఉపాధ్యాయుడు మురళీధర్ సాంవత్సరిక కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో టీడీపీ మండలా ధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ తటస్థులేనా!

- కొందరి చేరికల పట్ల టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తి
- ఇక మీదటైనా జాగ్రత్త పడాలని శ్రేయోభిలాషుల హెచ్చరిక


టీడీపీలో చేరిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో సమావేశమైన చంద్రబాబు

కుప్పం, జూలై 31: 'మనం కాదంటే వేరే పార్టీలోకి వెళ్లిపోతారు. అప్పుడేం చేస్తారు? అది భవిష్యత్తుకు మంచిదికాదు. వైసీపీనుంచి వస్తామన్న వాళ్లలో తటస్థులను జాగ్రత్తగా ఎంపిక చేసుకోండి. మన పార్టీకి, కార్యకర్తలకు గతంలో ఉద్దేశపూర్వకంగా నష్టం కలిగించని తటస్థులనే పార్టీలో చేర్చుకుందాం.'

- గత వారంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నేతలతో జరిపిన టెలికాన్ఫరెన్స్‌లో వెలిబుచ్చిన అభిప్రాయమిది.

'మీరు అలా మాట్లాడకూడదు. పార్టీలో మీకు నష్టం జరగకుండా చూసే బాధ్యత నేను, చంద్రబాబు, లోకేశ్ తీసుకుంటాం. ఎన్నికల్లో పార్టీకోసం కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుంది. వారిని ఎలా పైకి తీసుకు రావాలన్నది మేం ఒక ప్రణాళిక వేస్తున్నాం. త్వరలోనే కష్టపడిన కార్యకర్తలందరికీ మంచి జరుగుతుంది.'

- నారా భువనేశ్వరి కుప్పం పర్యటన సమయంలో ఇటీవల కార్యకర్తలకు ఇచ్చిన హామీ ఇది.

అయితే బుధవారం చంద్రబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరిగిన తీరుపై నియోజకవర్గంలోని టీడీపీ కేడర్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లతోపాటు కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాలనుంచి 14 మంది ఎంపీటీసీలు విజయవాడలో బుధవారం చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పర్యవేక్షణలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆయా కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో మంతనాలు జరిగాక, జరిగిన చేరికలు ఇవి. అయినా ఈ చేరికలపై ఇప్పుడు కుప్పంలోని టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తి కనిపిస్తోంది. వారిలోని అసహనం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడవుతోంది. రాక్షసుల్లాంటి వైసీపీ నేతలు, వారికి వత్తాసు వచ్చిన నాటి పోలీసుల చేతుల్లో చాబు దెబ్బలు తిని, అక్రమ కేసులు పెట్టించుకుని బూత్‌లు కాపాడుకుంటే, ఇప్పుడు ఆయా ప్రాంతాలలో అరాచకాలకు పరాకాష్టగా నిలిచిన వైసీపీ నేతలను పార్టీలో చేర్చుకోవడంపట్ల ఆవేదనా భరితమైన పోస్టులు టీడీపీ కార్యకర్తలు పెడుతున్నారు.

గుంపులో గోవిందలా తోసేశారా?

అయితే టీడీపీ కార్యకర్తల్లోని ఈ అసంతృప్తి, అసహనాలు పార్టీలో చేరిన అందరిపైనా కాకుండా కొందరిపైనే వ్యక్తం కావడం గమనార్హం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నాటి అధికార పార్టీ నాయకులతో అంటకాగి, టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడడంతోపాటు కుట్రలకు పాల్పడిన కొద్దిమంది మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలను టీడీపీలో చేర్చుకోవడాన్ని పార్టీలోని కిందిస్థాయి కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. చేరికలకు నేతృత్వం వహించిన ఆయా మండలాల నాయకులు తటస్థులు కాకున్నా సరే, చేరికల జాబితాలో వ్యూహాత్మకంగా చేర్చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

వారపుసంత దారి ఏర్పాటుపై ఆర్డీవో విచారణ

పుంగనూరు రూరల్, జూలై31: పుంగనూరు వారపుసంత రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణంపై బుధవారం పలమనేరు సబ్‌కలెక్టర్ మనోజ్‌కుమార్‌రెడ్డి విచారణ చేపట్టారు. పాతబస్టాండ్ సమీపంలోని నేషనల్ హైవే రోడ్డు నుంచి ఉబేదుల్లా కాంపౌండ్‌కు వెళ్లే వారపు సంత రోడ్డును ఆక్రమించి తనకు పరిహారం ఇవ్వకుండా వైసీపీ నేతలు దౌర్జన్యంగా సీసీ రోడ్డు వేసినట్లు ఇటీవల మదనపల్లెలో ఉష అనే మహిళ రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ సిసోడియాకు ఫిర్యాదు చేయడంతో ఆయన విచారణకు ఆదేశించారు. ఆర్డీవో మనోజ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ శివయ్య, మున్సిపల్ అధికారులు రోడ్డు పరిశీలించి ఫిర్యాదుదారు ఉషతో మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ గత 40 ఏళ్లుగా వారపు సంత రోడ్డు ఉందని, ప్రజలకు రోడ్డు చాలా ఉపయోగపడుతోందని, ఉన్న రోడ్డుపై ప్రజల అభ్యర్థనతో సీసీ రోడ్డు వేసినట్లు ఆర్డీవోకు తెలిపారు. తనకు రూ.4కోట్లు పరిహారం కావాలని ఆమె కోరుతూ హైకోర్టులో కేసు దాఖలు చేయడంతో మున్సిపల్ అధికారులు కోర్టులో కౌంటర్ వేశామని, ఈ వివాదం కోర్టు పరిధిలో ఉందని వివరించారు.

సొంత నిధులతో హరిజనవాడకు తాగునీరు

గంగవరం, జూలై 31 :గ్రామస్తు లందరూ ఏకమై సొంతనిదులు ఖర్చుచేసి గుండుగల్లు హరిజన వాడకు తాగునీటి సరఫరాను పున రుద్ధరించారు. గుండుగల్లు హరిజన వాడలో ఓ ప్రాంతానికి తాగునీరు పుష్కలంగా ఉన్నా, సరైన పైప్‌లైన్, ట్యాపులు లేక కొంతకాలంగా నీటిని సరఫరా చేసేవారు కాదు. ఈ విషయాన్ని గుర్తించిన గుండుగల్లు వాసులు హరిజనవాడలో సుమారు రూ.20 వేలు వెచ్చించి పైప్‌లైన్లను సరిచేసి తాగునీటిని అందించారు.

మాకు ఉద్యోగ భద్రత కల్పించండి

కుప్పం, జూలై 31: కుప్పం రెస్కో పంచాయతీ ముఖ్యమంత్రి చంద్రబాబు వద్దకు చేరింది. వైసీపీ హయాంలో అక్రమంగా నియమితులైనట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 121 మంది ఉద్యోగుల్లో 40 మంది ఉద్యోగులు బుధవారం విజయవాడలో ముఖ్యమంత్రిని కలిసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాల్సిందిగా విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము నాలుగేళ్లుగా కుప్పం రెస్కోలోని వివిధ సెక్షన్ కార్యాలయాలలో వివిధ విభాగాలలో విధులు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆరు నెలలపాటు జీతభత్యాలు లేకుండానే విధులు నిర్వహించామ న్నారు. తర్వాత తమకు కంటింజెంట్ వర్కర్స్ రూపంలో వేతనంగా రూ.12,500 వోచర్ జీతాన్ని 2021 మార్చి నుంచి ఇస్తున్నారన్నారు. 20 నెలలు ఇదే వేతనంతో పనిచేశాక పనితీరు, అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని కుటుంబ ఆర్థిక పరిస్థితిని వివరించగా తమలో 40 మందికి 2022 అక్టోబరు 15వ తేదీనుంచి కన్సాలిడేటెడ్ చేస్తూ వేతనాలు ఇచ్చారని, 13 నెలలపాటు ఇదేవిధంగా పనిచేశామని తెలిపారు. తర్వాత ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేసి ఆమేరకు వేతనాలు ఇచ్చారన్నారు. అయితే నెల రోజులుగా ఉద్యోగ అభద్రతతో గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణల పేరుతో జేసీ సమావేశమై నోటీసులు ఇవ్వడానికి నిర్ణయించార న్నారు. ఈ విషయాలన్నింటినీ పరిశీలించి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని రెస్కో ఉద్యోగులు కోరారు. ఇదే విషయాన్ని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా విన్నవించారు. తమకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి, విద్యుత్తు శాఖ మంత్రి హామీ ఇచ్చినట్లు ఉద్యోగులు తెలిపారు.

భూసార పరీక్షలతో నాణ్యమైన దిగుబడి

గంగవరం, జూలై 31 : ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించుకుని వ్యవసాయ అధికారులు సూచించిన పంటలను పండించినట్లయితే తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి సాధించడానికి దోహదపడుతుందని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ నాగపద్మిణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పత్తికొండలో రైతులకు భూసార పరీక్షల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షలు చేయడం ద్వారా భూమిలో సత్తా ఎంతమేరకు ఉందని తేలడంతో పాటు, దానికి తగ్గట్లు ఎరువుల మోతాదుతో పంటలను పండించుకోవడానికి అవకాశముంటుందన్నారు. ప్రస్తుతం వేరుశెనగ పంట పూత దశలో ఉండడంతో ఎకరాకు 200 కేజీల జిప్సం వేసినట్లయితే కాయ నాణ్యతగా, మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. రైతులు వేసే ప్రతిపంటకు విత్తనశుద్ధి తప్పనిసరి అని అన్నారు. విత్తన శుద్ధి చేసి వేరుశెనగ పంట చుట్టూ జొన్న లేదా సజ్జ పంటను వేయడం వలన చీడపురుగులను నివారించడానికి వీలవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారిణి హేమలత, విఏఏ మనీష, రైతులు పాల్గొన్నారు.

ఉమ్మడి వనరులను సంరక్షించాలి

చౌడేపల్లె, జూలై31: ఉమ్మడి వనరులను సంరక్షించటం అందరి బాధ్యత అని ఏపీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం వెలుగు కార్యాలయంలో జరిగిన ఉమ్మడి వనరుల అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా రైతు పొలాల్లో, కొండలు, చెరువులు, శ్మశానవాటికలు, పశుమేత భూముల్లో పశుగ్రాసాన్ని పెంచి ఉమ్మడి వనరులను అభివృద్ధి చేయటంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ తల్లా శ్రీనివాసులు, మండల అభివృద్ధి కమిటి అధ్యక్షుడు ప్రభాకర్, పశువైద్యాధికారి పవన్‌కుమార్, టీఏ ధనుంజయుడు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ సేవలు అభినందనీయం



పుంగనూరు, జూలై 31: పుంగనూరు మున్సిపాలిటీలో స్వీపర్‌గా 38 ఏళ్లుగా కె. రెడ్డెమ్మ అందించిన సేవలు అభినందనీయమని కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో రెడ్డెమ్మ పదవీ విరమణ కార్యక్రమంలో పాల్గొని ఆమెను దుశ్శాలువతో సత్కరించారు. ఆమెను శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య, అధికారులు, సిబ్బంది సన్మానించారు.

డీసీవోకు సూపర్‌బజార్ ఓటర్ల జాబితా

పలమనేరు, జూలై31 : పలమనేరులోని డి.బాలాజి కోఆపరేటివ్ సూపర్‌బజార్‌కు ఎన్నికలు నిర్వహించేందుకుగాను జిల్లా సహకార శాఖ అధికారి(డీసీవో) ఆదేశాల మేరకు ఓటర్ల జాబితా, బైలాస్‌ను ఈనెల 29న పంపినట్లు సూపర్‌బజార్ అధ్యక్షుడు ఆర్వీ సుభాష్‌చంద్రబోస్ తెలిపారు. ఇక ఎన్నికల ప్రక్రియ డీసీఓ నిర్వహించాల్సి ఉంది. ఇలా వుండగా గత ప్రభుత్వ హయాంలో బోస్ అధ్యక్షుడిగా ఉన్న పాలక వర్గం పదవీ కాలం పొడిగిస్తూ ఇచ్చిన గడువు కూడా ఆగస్టు 4న ముగియనుంది. దీంతో ప్రభుత్వం మళ్లీ ఎన్నికలు నిర్వహించేంత వరకు స్పెషల్ ఆఫీసర్‌ను నియమించే అవకాశం లేకపోలేదు.

మామిడి కొమ్మల కత్తిరింపుపై అవగాహన

వి.కోట : రైతులు సరైన సస్యరక్షణ చేపట్టడం ద్వారా మామిడిలో మంచి దిగుబడులు సాధించవచ్చని ఉద్యాన శాఖాధికారి శ్రీనివాసులురెడ్డి అన్నారు. ఎస్.బండపల్లె పంచాయతీ కొత్తకోటలో కొమ్మ కత్తిరింపులపై రైతులకు అవగాహన కల్పించారు. చెట్టుపై ఎండిన కొమ్మలు, అడ్డదిడ్డంగా పెరిగిన కొమ్మలను కత్తిరించాలన్నారు. చెట్టు మధ్యలో నిటారు కొమ్మను కత్తిరించి ఓపెన్ చెయ్యాలన్నారు. దీని వల్ల గాలి, వెలుతురు, సూర్యరశ్మి బాగా ప్రసరించి తెగుళ్ళు, తేనెమంచు పురుగుల ఉధృతి బాగా తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారులు, మామిడి రైతులు పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

రివర్షన్ అమలు అలసత్వంపై ఎస్టీయూ ధర్నా



డీఈవోకు నోటీసు ఇస్తున్న ఎస్టీయూ నేతలు

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: పదోన్నతి రివర్షన్‌కు దరఖాస్తు చేసుకున్నా వాటి అమలులో అలసత్వంపై శనివారం డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా చేయనున్నట్లు ఎస్టీయూ నాయకులు తెలిపారు. ఈ మేరకు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్‌యాదవ్‌లు బుధవారం డీఈవో దేవరాజుకు నోటీసు అందించారు. రివర్షన్ అమలు విషయంలో ఏడాదిగా కార్యాలయం చుట్టూ తిరిగినా ఎలాంటి స్పందన లేకపోవడం బాధాకరమని, అందుకే ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్, సీనియర్ నాయకులు దేవరాజులు రెడ్డి, చంద్రన్, కిషోర్, జీవరత్నం, లక్ష్మీపతి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలను శుభ్రం చేయండి



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కమిషనర్ అరుణ

చిత్తూరు, జూలై 31: నగరంలోని డ్రైనేజీలను శుభ్రం చేయాలని కమిషనర్ అరుణ నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె కయనికట్టు, ఖాదర్‌మిరాన్ వీధుల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. కాలువల్లో పూడిక, వ్యర్థాలను తొలగించి, బ్లీచింగ్ చల్లాలని సూచించారు. అనంతరం ఓబనపల్లె, గంగమ్మ ఆలయం వెనుక నిల్వ నీటి కుంటలను పరిశీలించారు. నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. ఈ కార్యక్రమంలో డీఈ వెంకటప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు లోకనాథం, అమరనాథరెడ్డి, ఏఈ రవీంద్ర, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ ఎమ్మెల్యే'

చిత్తూరు, జూలై 31: చిత్తూరు నియోజకవర్గ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ఆధ్వర్యంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం జరుగుతుందని కమిషనర్ అరుణ తెలిపారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు 9849907885కు ఫోన్ చేసి చిత్తూరు రూరల్, గుడిపాల, చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలోని సమస్యలను నేరుగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావచ్చని పేర్కొన్నారు.

సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



యాదమరి, జూలై 31: వాతావరణ పరిస్థితులకనుగుణంగా ప్రకృతి వ్యవసాయం, సాగు పద్ధతులపై బుధవారం జిల్లా వనరుల కేంద్ర వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని రైతులకు అవగాహన కల్పించారు. మండలంలోని కాశిరాల పంచాయతీ పెరుమాళ్లపెంట గ్రామంలో సర్పంచ్ రాధమ్మ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా సమతుల్య ఎరువుల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. అలాగే వేసవిలో దుక్కుల ఆవశ్యకత, ఉపయోగాలు, పచ్చిరొట్ట పైర్ల సాగు, జీవన ఎరువుల ఉపయోగాల గురించి వివరించారు. మండల వ్యవసాధికారిణి చరిత పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే నివాళి



సుమతి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే భాను

విజయపురం, జూలై 31: మండలంలోని కేవీపురం టీడీపీ సీనియర్ నేత బాబునాయుడు సతీమణి, మాజీ సర్పంచ్ సుమతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ బుధవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. టీడీపీ నేతలు వేణుగోపాల్‌నాయుడు, గోవర్ధన్, మధునాయుడు, జీవరత్నం ఆయన వెంట ఉన్నారు.

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



యాదమరి, జూలై 31: తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను బుధవారం యాదమరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద సీహెచ్‌వో లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. ఆగస్టు ఒకటో తేదీ నుంచి వారం రోజులు తల్లిపాల వారోత్సవాలు ఉంటాయని తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి గర్భిణులు, బాలింతలకు వివరిస్తామన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మీపతి, అనసూయమ్మ పాల్గొన్నారు.

గంగయ్య సేవలు ప్రశంసనీయం



గంగయ్య దంపతులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

విజయపురం, జూలై 31: విజయపురం ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా గంగయ్య సేవలు ప్రశంసనీయమని ఎంఈవో హరిప్రసాద్‌వర్మ కొనియాడారు. బుధవారం ఆయన ఉద్యోగ విరమణ సందర్భంగా పూలమాలలు, దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. హెచ్ఎం శ్యామల, యూటీఎఫ్ నాయకులు ఎస్ఎస్‌నాయుడు, ముత్యాలరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయులు చంద్రయ్య పాల్గొన్నారు.

సబ్సిడీ ధరకు పశుగ్రాసం విత్తనాలు

పాలసముద్రం, జూలై 31: రైతులకు సబ్సిడీ ధరపై పశుగ్రాసం విత్తనాలను అందిస్తున్నట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ యశశ్రీ తెలిపారు. మండలానికి మొక్కజొన్న, జొన్న టన్ను కేటాయించారని వెల్లడించారు. సబ్సిడీపై మొక్కజొన్న కిలో రూ.20, జొన్నలు రూ.25 వంతున పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నాయని, కావాల్సిన రైతులు పశువైద్యశాలలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థినులు నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: విద్యార్థినులు అన్ని రంగాల్లో రాణించాలంటే నాయకత్వ లక్షణాలు పెంచుకోవాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లక్ష్యంతో పాటు నాయకత్వ లక్షణాలు ఉంటే సమాజంలో సమర్థవంతంగా రాణించగలరన్నారు. కళాశాల నీటి అవసరాలను తీర్చేందుకు బోరు వేయిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి, టీడీపీ నాయకులు, కళాశాల అధ్యాపకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ మనోహర్, మాజీ మేయర్ కఠారి అనురాధ, తెలుగు మహిళా నేత వైవీ రాజేశ్వరి పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన అవసరం

రోడ్డు భద్రతపై ప్రతి విద్యార్థీ అవగాహన పెంచుకోవాలని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి చెప్పారు. బుధవారం కళాశాలలో రవాణా శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జిల్లా మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ నరసింహులు వాహనాలు నడిపే, రోడ్డు దాటే సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అసిస్టెంట్ మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, జూలై 31: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అధికారులు బాధ్యతగా పనిచేయాలని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్మశాన వాటికలు లేని గ్రామాలను గుర్తించి వాటికి స్థలం కేటాయించాలన్నారు. అభివృద్ధి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. గత ప్రభుత్వం తరహాలో నిధులు పక్కదారి పట్టకుండా చూడాలన్నారు. పేదవారికి ఉపాధి హామీ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా అవగాహన కల్పించాలన్నారు.

సమష్టి కృషితో విద్యా ప్రమాణాలు పెంచండి



ఉపాధ్యాయులతో సమావేశమైన డీవైఈవో చంద్రశేఖర్

బంగారుపాళ్యం, జూలై 31: ఉపాధ్యాయులు సమష్టి కృషితో విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని చిత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి చంద్రశేఖర్ అన్నారు. బుధవారం బంగారుపాళ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను డీవైఈవో సందర్శించారు. వివిధ అంశాలను పరిశీలించి, ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన పద్ధతులు ఉండాలని సూచించారు. వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఎంఈవో రమేష్, ఇన్‌చార్జి హెచ్ఎం జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు గంటా మోహన్, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ద్వారకా తిరుమల ఈవో



ఈవోకు జ్ఞాపిక అందిస్తున్న సూపరింటెండెంట్ వాసు

ఐరాల (కాణిపాకం), జూలై 31: కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని బుధవారం ద్వారకా తిరుమల ఆలయ కార్యనిర్వహణాధికారి త్రినాథరావు దర్శించుకున్నారు. సూపరింటెండెంట్ వాసు ఆయనకు స్వాగతం పలికి, స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో ఆశీర్వదించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్లు విఘ్నేష్, రవి, చిట్టిబాబు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేపై అవగాహన కల్పించండి



అర్జీలు స్వీకరిస్తున్న డీఈ శేషాద్రి

చిత్తూరు రూరల్, జూలై 31: విద్యుత్తు శాఖ కార్యాలయంలో ప్రతి బుధవారమూ నిర్వహించే గ్రీవెన్స్ డేపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం గాంధీ రోడ్డులోని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. డీఈ శేషాద్రి వినతులు స్వీకరించారు. ఈఈ మాట్లాడుతూ గ్రీవెన్స్ డేలో అన్ని రకాల విద్యుత్ సంబంధించి వినియోగదారులు, రైతులు ఫిర్యాదు చేయవచ్చునన్నారు. 90 శాతం అక్కడికక్కడే పరిష్కరిస్తామన్నారు.

బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులుమూర్తి

ఐరాల, జూలై 31: బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసులుమూర్తి అన్నారు. మండలంలోని గోవిందరెడ్డిపల్లె ఎస్టీ కాలనీలో బుధవారం ఉచిత వైద్య శిబిరం, ఆధార్‌కార్డుపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీలకు ప్రభుత్వం అందించే ప్రతి పథకమూ అందేలా చూస్తామన్నారు. వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ రక్తహీనత వల్ల సంభవించే దుష్పరిణామాల గురించి వివరించారు. సర్పంచ్ గుణవతి, స్త్రీశిశు సంక్షేమ అధికారి నిర్మల, జిల్లా గిరిజన శాఖ అధికారి మురళీకృష్ణ, టీడీపీ నాయకులు ఏపీ రంజిత్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఏపీ రాజేష్‌రెడ్డి, ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్యామల తదితరులు పాల్గొన్నారు.



మా.. పూతలపట్టు శాసనసభ సభ్యులు గారికి
జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
డా॥ కలికిరి మురళీమోహన్ గారు
శాసనసభ సభ్యులు, పూతలపట్టు నియోజకవర్గం
నిత్యం ప్రజాసేవకు అంకితమైన వ్యక్తి, వ్యక్తిగత అభివృద్ధి కాకుండా వ్యవస్థ బాగు కోసం పరితపిస్తూ...
నియోజకవర్గ బాగు కోసం అహర్నిశలు పాటుపడుతున్న మా శాసనసభ సభ్యులు
డా॥ కలికిరి మురళీమోహన్ గారికి మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.
ఆ కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆశీస్సులతో మీరు మరెన్నో పుట్టినరోజు
వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షిస్తు...
Saagaz coffee express
South Indian Filter Coffee
Saagaz
SAAGAZ BISCUITS
GIRI'S
GIRIS AQUA DRINKING WATER
KKN FOODS AND BEVERAGES
Sankranti Palli CHITTOOR

హిందీలో నూతన పాఠ్యాంశాలను రద్దు చేయాలి

నగరి, జూలై 31: పదో తరగతి విద్యార్థుల కోసం ఈ ఏడాది ప్రవేశపెట్టిన హిందీ పాఠ్యాంశాలు కఠినంగా ఉన్నాయని, వాటిని వెంటనే రద్దు చేయాలని చిత్తూరు జిల్లా హిందీ పండిట్స్ యూనియన్ అధ్యక్షుడు నాగభూషణం నాయుడు డిమాండ్ చేశారు. హిందీయేతర ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లాంటి రాష్ట్రాలలో ఇలాంటి కఠినమైన పాఠ్యాంశాలు పెట్టి విద్యార్థులను తిప్పలు పెట్టడం విచారకరమన్నారు. పునఃసమీక్ష చేయాలని బుధవారం ఆయన ఒక ప్రకటనలో కోరారు.

వేలావడిలో పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేయిస్తున్న సచివాలయ సిబ్బంది

నగరి, జూలై 31: మండల పరిధిలోని వేలావడిలో మంగళ, బుధవారాలు పారిశుధ్య పనులు చేపట్టారు. ఈవోపీఆర్డీ అరుణ, పంచాయతీ కార్యదర్శి దాక్షాయణి ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్తాచెదారాన్ని ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. గుంటలలో నిల్వ ఉన్న మురికి నీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లారు. సీజనల్ వ్యాధులు రాకుండా ఈ మేరకు చర్యలు చేపట్టినట్లు ఈవోపీఆర్డీ అరుణ తెలిపారు.

ఆరోగ్య సూత్రాలు పాటించాలి


సమావేశంలో మాట్లాడుతున్న మూర్తి

తవణంపల్లె, జూలై 31: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి మూర్తి కోరారు. మండలం లోని స్వస్తిక్ నగర్‌లో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని ఎస్సీ, ఎస్టీలకు రక్తపోటు, మధుమేహ పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. మూర్తి మాట్లాడుతూ సకాలంలో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, నయం చేయించుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.

జలకాలాటలలో..



కార్వేటినగరం, జూలై 31: కార్వేటినగరంలో బుధవారం ఎండ ఎక్కువగా కాసింది. ఉక్కపోత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అల్లాడిపోయారు. ఈ క్రమంలో కొందరు బాలురు ఇలా స్కంద పుష్కరిణిలో జలకాలాడుతూ ఉపశమనం పొందారు.

వెస్ట్ సీఐ రవిశంకర్‌కు ప్రశంసాపత్రం



గుడిపాల, జూలై 31: గుడిపాల ఏటీఎం దొంగతనం కేసును ఛేదించిన వెస్ట్ సీఐ రవిశంకర్ రెడ్డికి ఎస్పీ మణికంఠ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. ఆ కేసులో సీఐ కనబరిచిన చొరవను ఎస్పీ అభినందించారు.

కానిస్టేబుల్‌కు ప్రశంసాపత్రం


ఎస్పీ చేతులమీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న రఘురామ్

పెనుమూరు, జూలై 31: పెనుమూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రఘురామ్‌కు ఎస్పీ మణికంఠ బుధవారం ప్రశంసాపత్రం అందజేశారు. క్రిమినల్ కేసుల ఛేదనలో కీలకంగా వ్యవహరించడం, తమిళనాడు, ఒడిశా కేసుల్లో నిందితుల అరెస్టులో ప్రధాన భూమిక పోషించినందుకు ప్రశంసాపత్రం అందజేసినట్లు రఘురామ్ తెలిపారు.

పేదలకు అన్నదానం


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, జూలై 31: మండలంలోని అన్నాక్యాంటీన్‌లో పేదలకు ఏడాదిగా అన్నదానం చేస్తున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు తెలిపారు. దాతల సహకారంతో నిరంతరాయంగా కొనసాగుతోందన్నారు. నాయకులు బాలాజీ నాయుడు, హేమాద్రి నాయుడు, బలరామ్, జయచంద్ర, గురుస్వామి నాయుడు, సుధాకర్ యాదవ్, అరుణ్, ఐజాక్, రవి, రంగారెడ్డి, రవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రమణ్యేశ్వరస్వామి గ్రామోత్సవం



కార్వేటినగరం, జూలై 31 : స్థానిక సుబ్రమణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆడికృత్తిక ఉత్సవాలు ముగిసిన మరుసటి రోజు ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. స్వామివారికి ఉదయం నిత్య కైంకర్యాలు నిర్వహించి, సాయంత్రం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలు అర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

ఆడికృత్తిక ఆదాయం రూ.15.50 లక్షలు

ఆలయానికి ఆడికృత్తిక ఉత్సవాల సందర్భంగా ద్వారా రూ.15.5లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవో కృష్ణనాయక్ తెలిపారు. తలనీలాల వేలం ద్వారా రూ.1.25లక్షలు, తాత్కాలిక హుండీ ద్వారా రూ.3.16లక్షలు, శాశ్వత హుండీ ద్వారా రూ.64 వేలు, సేవా టికెట్ల విక్రయం ద్వారా రూ.6.20లక్షలు, విరాళాలు రూ.4.22 లక్షలు వచ్చినట్లు వివరించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక లాభాలు


టేకుమందలో పొలంబడి నిర్వహిస్తున్న అధికారులు

బంగారుపాళ్యం, జూలై 31: వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు పాటించి, అధిక లాభాలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి మురళీ కృష్ణ అన్నారు. మండలంలోని టేకుమంద గ్రామంలో బుధవారం వేరుశనగ పంటపై పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులు, విత్తన మోతాదు, విత్తనశుద్ధి, పూతదశలో జిప్సం వాడకం తదితర అంశాలపై రైతులకు విపులంగా వివరించారు. మండల వ్యవసాయాధికారి చిట్టిబాబు, విస్తరణాధికారి సాదరయ్య పాల్గొన్నారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ జీతాలు మంజూరు చేయాలి


అసిస్టెంట్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

చిత్తూరు రూరల్, జూలై 31: క్లాప్ డ్రైవర్లకు 10 నెలల పెండింగ్ జీతాలు మంజూరు చేయాలని ఏఐటీయూసీ నాయకులు లేబర్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఓంకార్‌కు బుధవారం వినతిపత్రం సమర్పించారు. 10 నెలలు జీతాలు ఇవ్వకపోవడంతో కార్మికులు కుటుంబాలను పోషించలేకపోతున్నారని ఏఐటీయూసీ నాయకుడు నాగరాజు పేర్కొన్నారు.

రంగనాథం కుటుంబానికి అండగా ఉంటాం


నివాళులర్పిస్తున్న సుబ్రహ్మణ్యం నాయుడు

గుడిపాల, జూలై 31: అనారోగ్యంతో మృతిచెందిన టీడీపీ కార్యకర్త రంగనాథం మందడి కుటుంబానికి అండగా ఉంటామని టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు అన్నారు. మండలంలోని చీలాపల్లిలో బుధవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. సర్పంచ్ అరుణ్, మాజీ సర్పంచ్ జయచంద్ర నాయుడు, టీడీపీ నాయకులు సురేష్, ఆనంద్ యాదవ్, రాజశేఖర్, శంకర్, బీజేపీ నాయకులు ఏలుమలై పాల్గొన్నారు.

నేటి నుంచి మన సంస్కృతి మాసోత్సవాలు


సమావేశంలో మాట్లాడుతున్న సహదేవనాయుడు

చిత్తూరు కల్చరల్, జూలై 31: మన సంస్కృతి జానపద కళా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటి నుంచి 31వ తేదీ వరకు మన సంస్కృతి మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు సంస్థ అధ్యక్షుడు ఆర్.సహదేవ నాయుడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ జానపద సంస్కృతికి ప్రతి రూపాలైన సంప్రదాయ గీతాలు, భక్తి భజనలు, పాటలు, చెక్క భజనలు తదితర అంశాలను ప్రదర్శించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా అర్జున తపస్సు

చిత్తూరు రూరల్, జూలై 31: చిత్తూరు రూరల్ మండలం కుర్చివేడు గ్రామ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం నిర్వహించారు. అర్జున వేషధారి తపస్సుమానులోని ఒక్కో మెట్టు కు ఒక్కో పద్యం పాడడం ఆకట్టుకుంది. టీడీపీ జిల్లా నేత చంద్రప్రకాష్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ నేతలు మోహన్‌రాజ్, శశికర్ బాబు, రఘు, మేషాక్, నీలకఠం నాయుడు, దేవరాజులు నాయుడు, జగదీష్ నాయుడు, కుర్చివేడు సర్పంచ్ దిలీప్ పాల్గొన్నారు. వీరిని నిర్వాహకులు సన్మానించారు.

ఇన్‌చార్జి ఏఈగా తులసిప్రసాద్

పెనుమూరు, జూలై 31: విద్యుత్ శాఖ మండల ఏఈగా పి.తులసిప్రసాద్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. పూతలపట్టు సబ్ ఇంజనీరుగా పని చేస్తున్న ఆయనకు పెనుమూరు ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు అప్పగించారు. ఇంతకుముందు ఇక్కడున్న ఏఈ విధుల్లో అలసత్వం వహిస్తున్న కారణంగా తప్పించారు.

ఎస్వీయూ డెవలప్‌మెంట్ డీన్‌గా బాలాజి


ఉత్తర్వులు అందుకుంటున్న బాలాజీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 31: ఎస్వీయూ డెవలప్‌మెంట్ డీన్‌గా బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ మేరిగ బాలాజీ నియమితులయ్యారు. వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం నియామక ఉత్తర్వులను ఆయనకు అందజేశారు. గూడూరుకు చెందిన బాలాజీ 2007లో అధ్యాపకులుగా చేరారు. ఈయన పర్యవేక్షణలో 13 పీహెచ్‌డీలు పూర్తయ్యాయి. 3 పుస్తకాలు, 116 పరిశోధనా వ్యాసాలు రాశారు. 11 రీసెర్చ్ ప్రాజెక్టులు చేశారు. అమెరికాలో పీడీఎఫ్ చేశారు. ఐసీఎంఆర్ అవార్డు ద్వారా రూ. 50 వేల నగదు బహుమతి పొందారు. ప్రొఫెసర్ బాలాజీని పలువురు అభినందించారు.

టీటీడీ ఈవోతో వీసీ, రిజిస్ట్రార్ భేటీ

ఎస్వీయూ అభివృద్ధికి ఆర్థిక సహకారం అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావును వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు కోరారు. బుధవారం ఆయన్ను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టీటీడీ నుంచి యూనివర్సిటీకి అందిస్తున్న వార్షిక నిధులను విడుదల చేయాలన్నారు. తప్పకుండా సహకరిస్తామని ఈవో హామీ ఇచ్చారు.

నేడు పింఛన్ల పంపిణీ

పెనుమూరు, జూలై 31: మండలంలో గురువారం పింఛన్ల పంపిణీ చేపట్టనున్నట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఉదయం 10 గంటలకు చార్వాగానిపల్లి సచివాలయంలో ఎమ్మెల్యే థామస్ పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

వెదురుకుప్పం: మండలంలో గురువారం పింఛన్ పంపిణీ పండుగ వాతావరణంలో చేపట్టనున్నారు. 'ఎన్టీఆర్ భరోసా' పథకం ద్వారా 13 గ్రామ సచివాలయాల పరిధిలో 8,167 మంది లబ్ధిదారులకు పింఛన్ల కింద రూ.5,41,77,500 పంపిణీ చేయనున్నారు.

ఉపాధిలో కూలీల సంఖ్య పెంచండి

పాలసముద్రం, జూలై 31: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ప్రస్తుతం మండలంలో రోజుకు 600 నుంచి 700 మంది మాత్రమే పనులు చేస్తున్నారని తెలిపారు. ఇకపై 13 పంచాయతీల్లో 200 మంది చొప్పున పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. 11 వారాలుగా కూలి డబ్బు అందకపోవడంతో కూలీలు రావడం లేదని సిబ్బంది ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో డబ్బు అందజేస్తామని చెప్పారు. ఏపీవో మార్గరెట్, ఈసీ అనూష, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం


బోరు డ్రిల్లింగ్ ప్రారంభిస్తున్న సుధాకర్‌రెడ్డి

వెదురుకుప్పం, జూలై 31: ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ చొరవతో ఆళ్లమడుగు జడ్పీ ఉన్నత పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారమైందని తెలుగు యువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు బోడిరెడ్డి సుధాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన పాఠశాలలో బోరు డ్రిల్లింగ్ పనులను ప్రారంభించారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో జడ్పీ నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు మరకాలకుప్పం సుధాకర్, వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి బోడిరెడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు దామోదరరెడ్డి పాల్గొన్నారు.

కంటి పరీక్షలు తప్పనిసరి


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సురేఖ

వెదురుకుప్పం, జూలై 31: 60 ఏళ్లు పైబడిన వారు ఆరు నెలలకొకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి డాక్టర్ సురేఖ తెలిపారు. బుధవారం పచ్చికాపల్లం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కంటి పరీక్షలు చేయించుకుని, వ్యాధులు రాకుండా చూసుకోవాలని కోరారు. అనంతరం పారా మెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వర్లు కంటి పరీక్షలు చేశారు.

4న యోగా పరిచయ తరగతులు

చిత్తూరు కల్చరల్, జూలై 31: సిద్ధి సమాధి యోగా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన యోగా పరిచయ శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు గురువులు తెలిపారు. ఉదయం 9.30 గంటలకు కొంగారెడ్డిపల్లె సంసిద్ క్యాంఫోర్డ్ ఇంగ్లిష మీడియం పాఠశాలలో, సాయంత్రం 6 గంటలకు గిరింపేట నగరపాలక ఉన్నత పాఠశాలలో తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

రైతులకు జొన్నల పంపిణీ



గుడిపాల, జూలై 31: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీలో రైతులకు పశు వైద్య అధికారిణి సాయిసుధ బుధవారం మొక్కజొన్న పిండి, జొన్నలు పంపిణీ చేశారు. జూనియర్ పశువైద్యాధికారి వెంకటేష్, టీడీపీ నాయకులు చల్లా, మహదేవ్, బాబు, ఆటో రమేష్ పాల్గొన్నారు.

వైసీపీ నేతల లీలలపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వండి

- ఆర్సీపురంలో రూ.కోటి స్థలం స్వాహాపై

సీసీఎల్‌కు రెవెన్యూ మంత్రి కార్యదర్శి లేఖ

తిరుపతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా రామచంద్రాపురం మండలంలోని భూవివాదంపై మూడు రోజుల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ కార్యదర్శి ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ (సీసీఎల్ఏ)కు బుధవారం లేఖ రాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గత నెలరోజులుగా భూ కబ్జాలపై ఆంధ్రజ్యోతి, ఈనాడు పత్రికల్లో ప్రచురితమైన కథనాలను జతచేస్తూ సీసీఎల్ఏకు రెవెన్యూ శాఖ కార్యదర్శి లేఖరాశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 9 భూవివాదాల వార్తలుండగా అందులో రామచంద్రాపురం మండల పరిధిలోని భూమికి తిరుపతి రూరల్ తహసీల్దార్ ధృవీకరించినట్టు నకిలీ రికార్డు తయారు చేసిన వైసీపీ నేతల వ్యవహారంపై ప్రచురించిన కథనం కూడా ఉంది. మూడు రోజుల్లో సీసీఎల్ఏ ఇచ్చిన నివేదిక ఆధారంగా తగు చర్యలను రాష్ట్రప్రభుత్వం తీసుకోనుంది. ఇదిలావుంటే బుధవారం ఆర్డీవో నిశాంత్ రెడ్డి ఇరువర్గాలను పిలిచి విచారణ చేపట్టారు. బాధితుడు కె.పురుషోత్తమ రెడ్డితో పాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న ద్రాక్షాయణి భర్త చిరంజీవుల రెడ్డి, వైసీపీ జడ్పీటీసీ డిల్లీరాణి హాజరయ్యారు. అయితే 1959 నుంచి పురుషోత్తం రెడ్డి దగ్గర ఉన్న డాక్యుమెంట్లను ఆర్డీవోకు సమర్పించగా, చిరంజీవుల రెడ్డి, డిల్లీరాణి ఆర్డీవో అడిగిన డాక్యుమెంట్లు సమర్పించలేకపోయినట్టు తెలిసింది.

అందరూ తటస్థులేనా!

- కొందరి చేరికల పట్ల టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తి
- ఇక మీదటైనా జాగ్రత్త పడాలని శ్రేయోభిలాషుల హెచ్చరిక

కుప్పం, జూలై 31: 'మనం కాదంటే వేరే పార్టీలోకి వెళ్లిపోతారు. అప్పుడేం చేస్తారు? అది భవిష్యత్తుకు మంచిదికాదు. వైసీపీనుంచి వస్తామన్న వాళ్లలో తటస్థులను జాగ్రత్తగా ఎంపిక చేసుకోండి. మన పార్టీకి, కార్యకర్తలకు గతం లో ఉద్దేశపూర్వకంగా నష్టం కలగించని తటస్థులనే పార్టీలో చేర్చుకుందాం.'

- గత వారంలో టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నేతలతో జరిపిన టెలికాన్ఫరెన్స్‌లో వెలిబుచ్చిన అభిప్రాయమిది.

'మీరు అలా మాట్లాడకూడదు. పార్టీలో మీకు నష్టం జరగకుండా చూసే బాధ్యత నేను, చంద్రబాబు, లోకేశ్ తీసుకుంటాం. ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన వారందరికీ గుర్తింపు ఉంటుంది. వారిని ఎలా పైకి తీసుకురావాలన్నది మేం ఒక ప్రణాళిక వేస్తున్నాం. త్వరలోనే కష్టపడిన కార్యకర్తలందరికీ మంచి జరుగుతుంది.'

- నారా భువనేశ్వరి కుప్పం పర్యటన సమయంలో ఇటీవల కార్యకర్తలకు ఇచ్చిన హామీ ఇది.

అయితే బుధవారం చంద్రబాబు సమక్షంలో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు జరిగిన తీరుపై నియోజకవర్గంలోని టీడీపీ కేడర్‌లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. కుప్పం మున్సిపాలిటీకి చెందిన ఐదుగురు వైసీపీ కౌన్సిలర్లతోపాటు కుప్పం, గుడుపల్లె, శాంతిపురం మండలాలనుంచి 14 మంది ఎంపీటీసీలు విజయవాడలో బుధవారం చంద్రబాబు సమక్షంలో పార్టీలో చేరారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పర్యవేక్షణలో ఆయా మండలాల పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ఆయా కౌన్సిలర్లు, ఎంపీటీసీలతో మంతనాలు జరిగాక, జరిగిన చేరికలు ఇవి. అయినా ఈ చేరికలపై ఇప్పుడు కుప్పంలోని టీడీపీ కార్యకర్తల్లో అసంతృప్తి కనిపిస్తోంది. వారిలోని అసహనం సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడవుతోంది. రాక్షసుల్లాంటి వైసీపీ నేతలు, వారికి వత్తాసు వచ్చిన నాటి పోలీసుల చేతుల్లో చాబు దెబ్బలు తిని, అక్రమ కేసులు పెట్టించుకుని బూత్‌లు కాపాడుకుంటే, ఇప్పుడు ఆయా ప్రాంతాలలో అరాచకాలకు పరాకాష్టగా నిలిచిన వైసీపీ నేతలను పార్టీలో చేర్చుకోవడంపట్ల ఆవేదనా భరితమైన పోస్టులు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెడుతున్నారు.


టీడీపీలో చేరిన ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో సమావేశమైన చంద్రబాబు

గుంపులో గోవిందలా తోసేశారా?

అయితే టీడీపీ కార్యకర్తల్లోని ఈ అసంతృప్తి, అసహనాలు పార్టీలో చేరిన అందరిపైనా కాకుండా కొందరిపైనే వ్యక్తం కావడం గమనార్హం. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నాటి అధికార పార్టీ నాయకులతో అంటకాగి, టీడీపీ కార్యకర్తలపై దాడులకు తెగబడడంతోపాటు కుట్రలకు పాల్పడిన కొద్దిమంది మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీలను టీడీపీలో చేర్చుకోవడాన్ని పార్టీలోని కిందిస్థాయి కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. చేరికలకు నేతృత్వం వహించిన ఆయా మండలాల నాయకులు తటస్థులు కాకున్నా సరే, చేరికల జాబితాలో వ్యూహాత్మకంగా చేర్చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొల్లా మదన్ మోహన్‌కు పలువురి ఘన నివాళి



రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కొల్లా వరుణ్ కుమార్ తండ్రి దివంగత మాజీ డీసీసీబీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి కొల్లా మదన్మోహన్ చిత్రపటానికి పలువురు జిల్లా అధికారులు, రాజకీయ ప్రతినిధులు బుధవారం నివాళులు అర్పించారు. కొల్లా మదన్మోహన్ డీసీసీబీ మేనేజర్‌గా ఉద్యోగంలో చేరి అంచెలంచెలుగా ఉన్నతాధికారుల ప్రశంసలు పొంది రెండు తెలుగు రాష్ట్రాల్లో డీసీసీబీలో ఉన్నత స్థాయిలో పనిచేసి వ్యవసాయ రంగానికి విశిష్ట సేవలందించి రైతుల సేవలో తరించారు. జనవరిలో పదవీ విరమణ పొందారు. తెలంగాణాలో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిచ్చి ఎంతో మంది రైతులకు రుణాలను మంజూరు చేసి రైతు పక్షపాతిగా నిలిచారు. అలాగే తెలంగాణాలో మొదటగా విదేశీ విద్యకు డీసీసీబీ ద్వారా విద్యార్థులకు రుణాలను మంజూరు చేశారు.

పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు నివాళులు

దివంగత డీసీసీబీ సీఈవో మదన్మోహన్ చిత్రపటానికి ఆయన నివాసమైన దుర్గానగర్ కాలనీలోని పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉమ్మడి పార్టీ నాయకులు, తెలుగు దేశం పార్టీ తెలుగు యువత ప్రతినిధులు నివాళులు అర్పించారు. చిత్తూరు జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు, చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, టీడీపీ ఉపాధ్యక్షులు చంద్ర ప్రకాష్, మాజీ మేయర్


మదన్‌మోహన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్


నివాళి అర్పిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

హేమలత, చిత్తూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాజూరు బాలాజీ, జిల్లా టీడీపీ మాజీ అధికార ప్రతినిధి వసంతకుమార్ చౌదరి, బీజేపీ నేతలు అట్లూరి శ్రీనివాసులు, హరిబాబు చౌదరిలతో పాటు పలమనేరు, కుప్పం, చిత్తూరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది కుటుంబ సభ్యులతో నివాళులు అర్పించారు.

ఈ నెల 21న ఆయన అనారోగ్య కారణంగా మరణించారు. బుధవారం ఆయన ఉత్తర క్రియలు జరిగిన సందర్భంగా పలువురు ఆయన చేసిన సేవలను కొనియాడారు.

మదన్మోహన్ విద్యాభ్యాసం..

చిత్తూరు నగరానికి చెందిన కె. చెంగల్రాయనాయుడు, కె. మనో రంజితమ్మ దంపతులకు 1961 జూలై 18న చిత్తూరులో జన్మించారు. ఈయన ప్రాథమిక విద్య బీజెడ్ హైస్కూల్, పీసీఆర్లో ఇంటర్మీడియట్, పీవీకేఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ, అనంతపురం శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎంఏ తోపాటు డీసీఆర్ఎఎస్ కోర్సును పూర్తి చేశారు. 1987లో చిత్తూరు డీసీసీబీలో మేనేజర్‌గా ఉద్యోగంలో చేరారు. 2003 వరకు డీసీసీబీ ఏజీఎం, డీజీఎంగా ఉన్నత పదవులను పొంది నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో పనిచేశారు. రాష్ట్ర విభజన అనంతరం జిల్లా నుంచి తెలంగాణ రాష్ట్రానికి వెళ్లిన ఉన్నతాధికారి ఈయనే. తెలంగాణాలో ఖమ్మం, నల్గొండలో సీఈవోగా పనిచేసి 2024

పలువురు పరామర్శ

రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి వరుణ్‌కుమార్ తండ్రి మదన్ మోహన్ మృతి చెందిన సందర్భంగా పలువురు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిలో జాతీయ టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభిరామ్, రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే థామస్ తో పాటు పలువురు డీసీసీబీ, నాబార్డు అధికారులు పరామర్శించారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్


నివాళి అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులు చంద్రప్రకాష్


నివాళులు అర్పిస్తున్న మాజీ మేయర్ కఠారి హేమలత తదితరులు

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన మేరకు పదవుల పందేరానికి ముహూర్తం సమీపిస్తోంది. కూటమి పార్టీల అధిష్ఠానాలు ఎంపిక ప్రక్రియపై కసరత్తు ప్రారంభించాయి. ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కష్టపడి పనిచేసిన నాయకులు, క్రియాశీలక కార్యకర్తల వివరాలను సేకరిస్తున్నాయి. ఆగస్టు మొదటి వారం తర్వాత విడతల వారీగా నామినేటెడ్ పదవులు భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఆగస్టు నెలాఖరులోపు సాధ్యమైనంత వరకూ మొత్తం పదవులు భర్తీ చేసే అవకాశం వుంది. దీంతో తిరుపతి జిల్లాలో ఆశావహుల ప్రయత్నాలు జోరందుకున్నాయి. రెండేళ్ళ తర్వాత పరిస్థితులు ఎలా వుంటాయోనని తొలి విడతలోనే ఛాన్సు కొట్టేయాలని ఆశావహులు ఆరాటపడుతున్నారు. దీంతో చివరి ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



వీరీ.. వీరీ.. గుమ్మడి పండూ.. వీరికే పదవి?

ఈ నెలలోనే నామినేటెడ్ పదవుల పందేరం

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

కష్టపడిన వారిని గుర్తిస్తున్న అధిష్ఠానాలు

కూటమి పార్టీల అధిష్ఠానాలు నామినేటెడ్ పదవుల భర్తీ ప్రక్రియ నేపథ్యంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించే పనిలో నిమగ్నమయ్యాయి. టీడీపీ విషయానికొస్తే నియోజకవర్గం నుంచీ వందమంది పేర్లను అప్‌లోడ్ చేయాలని అధిష్ఠానం ఆదేశించింది. ఆ మేరకు ఇప్పటికే జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచీ 80 వరకూ పేర్లు అధిష్ఠానానికి అందాయి. జిల్లా పార్టీ అధ్యక్షుడు జిల్లావ్యాప్తంగా 100-150 పేర్లు పంపించాల్సి వుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి కష్టపడిన వారి జాబితా అప్‌లోడ్ చేసే బాధ్యత కూడా జిల్లా అధ్యక్షుడికే అప్పగించినట్టు సమాచారం. ఇప్పటి వరకూ తిరుపతి నుంచీ 90 పేర్లు అప్‌లోడ్ అయ్యాయని చెబుతున్నారు. జనసేన పార్టీలో కూడా ఇదేరకమైన వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. ఈ పేర్లు ముందుపెట్టుకుని వారి స్థాయిని బట్టి స్థానికంగా ఆలయ కమిటీల్లో సభ్యులుగా, ఛైర్‌పర్సన్లుగా, మార్కెట్ కమిటీలలో డైరెక్టర్లుగా, ఛైర్‌పర్సన్లుగా, రాష్ట్రస్థాయి కార్పొరేషన్లలో డైరెక్టర్, ఛైర్‌పర్సన్ పోస్టులకు ఎంపిక చేయనున్నారు.

అందరి గురీ టీటీడీ, తుడాలపైనే!

టీటీడీ బోర్డు ఛైర్మన్, మెంబరు పదవులపైన, తుడా ఛైర్‌పర్సన్ పదవిపైనా ఎక్కువమంది ఆశావహులు గురి పెడుతున్నారు. టీటీడీ ఛైర్మన్ పదవి రాష్ట్రస్థాయిలో కీలకం కావడంతో జిల్లానుంచీ ఒకరిద్దరు మాత్రమే ఆశిస్తున్నారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్ తాను గతంలో తుడా ఛైర్మన్‌గా పనిచేసినందున ఈ పర్యాయం టీటీడీ ఛైర్మన్ పదవి ఇవ్వాలని, తిరుపతి ప్రాంత యాదవులతో శ్రీవారి ఆలయానికి వున్న అవినాభావ సంబంధాన్ని దృష్టిలో వుంచుకుని తనకు అవకాశం కల్పించాలని గట్టిగా కోరుతున్నారు. తన వయసు దృష్ట్యా రాజకీయంగా ఇదే తనకు చివరి అవకాశమని గుర్తు చేస్తున్నారు. టీటీడీ ప్రయోజనాల కోసం పోరాడిన నేపథ్యం కలిగిన తనను ఛైర్మన్‌గా నియమించాలని బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి అభ్యర్థిస్తున్నారు. వీరిద్దరే బాహాటంగా టీటీడీ ఛైర్మన్ పదవి కోరుతున్నారు.

టీటీడీ మెంబరు కోసం 300 దరఖాస్తులు

టీటీడీ బోర్డు మెంబరు పదవి కోసం రాష్ట్రవ్యాప్తంగా సీఎం చంద్రబాబుకు ఇప్పటి వరకూ 300 దరఖాస్తులు అందినట్టు సమాచారం. మూడు పార్టీలతో కూడిన కూటమి ప్రభుత్వం కావడం వల్ల చంద్రబాబుపై టీటీడీలో మెంబరు పదవుల కోసం మూడు పార్టీల నుంచీ విపరీతమైన ఒత్తిడి వుంది. 24 మందిని మాత్రమే నియమించే వీలున్నందున ఆశావహులను వడపోయడం సంక్లిష్టంగా మారిందని సమాచారం. జిల్లాకు లేదా తిరుపతికి కనిష్ఠంగా ఒకటి లేదా గరిష్ఠంగా రెండు మెంబరు పదవులకు మించి కేటాయించే అవకాశం లేదు. ఒత్తిడి ఎక్కువైతే ఒక్కటి కూడా ఇవ్వకపోయినా ఆశ్చర్యపడాల్సిన పని లేదు. జిల్లా నుంచీ బోర్డు మెంబరు కావాలని చాలామంది ఆశిస్తున్నారు. టీడీపీ నుంచీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, కోడూరు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ వర్మ, హేమాంబరధర రావు, ఊకా విజయ్‌కుమార్, జేబీ శ్రీనివాస్ తదితరులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. అలాగే జనసేన నుంచీ పసుపులేటి హరిప్రసాద్, కిరణ్ రాయల్ ఈ పదవి కోసం రేసులో వున్నారు. బీజేపీ నుంచీ ఛైర్మన్ పదవి రాకపోతే మెంబరు పదవి ఇవ్వాలని భానుప్రకాష్‌రెడ్డి కోరుతుండగా సామంచి శ్రీనివాస్, కోలా ఆనంద్ పేర్లు కూడా పరిశీలనలో వున్నాయి. వీరిలో పలువురు గత ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు. అలాగే కొందరు తమ పార్టీల కోసం కష్టకాలంలో ఆర్థిక భారం కూడా వహించారు.

తుడా ఛైర్మన్ పదవికి పలువురు ఆశావహులు

టీటీడీలో ఎక్స్ అఫిషియో మెంబరు హోదా కలిగిన తుడా ఛైర్మన్ పదవిని సైతం పలువురు నేతలు ఆశిస్తున్నారు. బ్రహ్మాండమైన కార్యాలయం, సిబ్బంది, వనరులు, క్యాబినెట్ హోదా కలిగిన పదవి కావడంతో ఈ పదవికి క్రేజ్ పెరిగింది. ఈ పదవికి తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, చంద్రగిరి నేతలు డాలర్స్ దివాకర్‌రెడ్డి, బడి సుధా యాదవ్, తిరుపతి నేతలు మబ్బు దేవనారాయణరెడ్డి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. రవినాయుడు తనకు అవకాశం ఇస్తే సామాన్య కార్యకర్తను గుర్తించినట్టు అవుతుందని, యువతను ప్రోత్సహించినట్టు అవుతుందని చెబుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళూ కష్టపడి పనిచేశానని, యువగళం పాదయాత్రలోనూ, అలాగే అధినేత సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి కార్యక్రమంలోనూ వెన్నంటి నడిచానని చెబుతున్నారు. బడి సుధా యాదవ్ చంద్రగిరి ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం శ్రమించగా దివాకర్‌రెడ్డి శ్రీకాళహస్తి, చంద్రగిరిల్లో పార్టీ కోసం పనిచేశారు. దేవనారాయణరెడ్డి తిరుపతి, చంద్రగిరి సెగ్మెంట్లలో పార్టీ కోసం పనిచేశారు. వీరిలో రవినాయుడు, సుధా యాదవ్, దేవనారాయణరెడ్డి పార్టీ కోసం వలు పోలీసు కేసులు, వేధింపులు ఎదుర్కొన్నారు. జనసేన నుంచీ హరిప్రసాద్, కిరణ్ రాయల్ టీటీడీ బోర్డు మెంబరు కాకుంటే తుడా ఛైర్మన్ పోస్టు అయినా దక్కుతుందని ఆశిస్తున్నారు. వారిలో కిరణ్ రాయల్ గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు కేసులు, వేధింపులకు గురయ్యారు.

జోరందుకున్న ఆశావహుల యత్నాలు

నామినేటెడ్ పోస్టుల భర్తీకి సమయం సమీపించడంతో ఆశావహుల యత్నాలు జోరందుకున్నాయి. పలువురు నేరుగా తమ పార్టీల అధినేతలను కలుస్తున్నారు. ఆయా పార్టీల కోసం తాము అందించిన సేవలను గుర్తు చేస్తూ, పార్టీల కోసం తాము పడిన కష్టాలను ఏకరువు పెడుతున్నారు. తమకు ఫలానా పదవి కావాలని కొందరు సూటిగా ప్రస్తావిస్తుండగా మరికొందరు ఫలానా పదవి ఇవ్వాలని అది లేకుంటే ప్రత్యామ్నాయంగా ఫలానా పదవి ఇవ్వాలని అధిష్ఠానాల ఎదుట ప్రతిపాదనలు పెడుతున్నారు. కొందరైతే ఏ పదవి ఇచ్చినా పర్వా లేదని అధిష్ఠానాలకే వదిలి పెడుతున్నారు.

ప్రత్యామ్నాయంగా పార్టీ పదవులు

ప్రభుత్వ నామినేటెడ్ పదవుల కోసం పోటీ పెరిగిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పదవులు తెరపైకి వస్తున్నా యి. టీడీపీలో జిల్లా పార్టీ అధ్యక్ష పదవి, తిరుపతి అసెంబ్లీ ఇంచార్జి పదవులతో ఇద్దరిని సమాధానపరిచే అవకాశం కనిపిస్తోంది. అధికారంలో వున్నందున పార్టీ పదవులు తీసుకునేందుకు కొందరు సిద్ధంగా వున్నారు. అయితే వట్టి పార్టీ పదవులే అయితే తమకు అధికారులు విలువ ఇవ్వరని, ఏదో ఒకటి ప్రోటోకాల్ పదవి కూడా అనుబంధంగా ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నారు. ఇదే పరిస్థితి జనసేన పార్టీలోనూ కనిపిస్తోంది. ఆశావహుల్లో ఎవరో ఒకరిని జిల్లా అధ్యక్ష పదవితో సంతృప్తిపరిచే అవకాశముంది.

జిల్లాలో భర్తీకి అవకాశం వున్న పదవులు ఇవీ!

తిరుపతి జిల్లాలో టీటీడీ ట్రస్టు బోర్డు ఛైర్మన్, బోర్డు మెంబర్లు, తుడా ఛైర్ పర్సన్, స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు కీలకమైనవి.ఇందులో టీటీడీ ఛైర్మన్ నిస్సందేహంగా రాష్ట్రస్థాయి పదవి. తుడా ఛైర్‌పర్సన్, తిరుపతి స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు క్యాబినెట్ ర్యాంకు కలిగినవే అయినా వాటిని జిల్లాస్థాయి పదవులుగానే పరిగణించే పరిస్థితి. తర్వాత కేటగిరీలో , ముక్కంటి, చెంగాలమ్మ, సురుటుపల్లి, వెంకటగిరి పోలేరమ్మ, తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ తదితర ముఖ్య ఆలయాల పాలక మండళ్ళు, జిల్లా గ్రంధాలయ అభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్ పదవులున్నాయి. అలాగే వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకమండళ్ళు వున్నాయి. ముక్కంటి ఆలయం మొదలుకుని ఇవన్నీ స్థానిక ప్రాధాన్యత కలిగిన పదవులు. ఇవి కాకుండా రాష్ట్రస్థాయి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పదవులు, వాటిల్లో డైరెక్టర్ పదవులు కూడా కొన్ని జిల్లాకు దక్కే అవకాశముంది. వివిధ అకాడమీలు, వక్ఫ్ బోర్డు, హజ్ కమిటీ, మహిళ, ఎస్సీ, మైనారిటీ కమిషన్ల ఛైర్‌పర్సన్ పదవులు, వాటిలో డైరెక్టర్ పదవులు వంటికి కూడా కొన్ని జిల్లా నేతలకు దక్కవచ్చు.

డీటీసీ డీఎస్పీ బదిలీ

చిత్తూరు, జూలై 31: డీటీసీ డీఎస్పీ శ్రావణ్‌కుమార్‌ను ఏలూరు నగర డీఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కుప్పం డీఎస్పీగా ఉన్న శ్రీనాథ్ ఇంటెలిజెన్స్ డీఎస్పీగా బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా ఉన్న పార్థసారథిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఎస్‌ఎంసీ ఎన్నికలకు మోగిన నగారా

చిత్తూరు (సెంట్రల్), జూలై 31: ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికలకు రాష్ట్ర విద్యాశాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. గురువారం ఎన్నికల షెడ్యూల్‌ను అధికారికంగా జారీ చేయనుంది. రెండేళ్ల కాలపరిమితితో కమిటీ ఏర్పాటు చేస్తారు. ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ జారీ చేస్తారు. మధ్యాహ్నం 2 గంటలకు అభ్యర్థుల జాబితాను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తారు. 5న ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటరు జాబితాపై అభ్యంతరాలను తెలియజేయడం, ఫిర్యాదులుంటే పరిష్కరించడం చేస్తారు. మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటలకు తుది ఓటరు జాబితా ఖరారు, నోటీసు బోర్డులో ప్రదర్శన ఉంటుంది. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల నిర్వహణ, మధ్యాహ్నం 1.30 గంటలకు ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నిక, మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం, మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ తొలి సమావేశం నిర్వహించాల్సి ఉంది.

నేడు పింఛన్ల పంపిణీ

చిత్తూరు (సెంట్రల్), జులై 31: సామాజిక పెన్షన్ల పంపిణీ గురువారం ఉదయం 6 గంటలకు ప్రారంభం కానుంది. జిల్లాలోని 2,70,619 మంది లబ్ధిదారులకు అవసరమైన రూ.114.10 కోట్లు విడుదలయ్యాయి. బ్యాంకుల ద్వారా ఈ మొత్తం గ్రామ, వార్డు సచివాలయాలకు చేరాయి. సచివాలయ ఉద్యోగులు ఉదయం 6 గంటల నుంచి పెన్షన్ పంపిణీ చేయనున్నారు. ప్రతి లబ్ధిదారుడి ఇంటికివెళ్లి నేరుగా అందించనున్నారు.టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన రెండవనెల పెన్షన్ల పంపిణీ జరగనుంది. పెంచిన మొత్తాన్ని లబ్ధిదారులకు అందజేయనున్నారు.జిల్లాలోఅత్యధికంగా 1.44లక్షలమంది వృద్ధాప్య పెన్షనర్లు ఉండగా, 59,903 మంది మంది వితంతువులు, 35,732 మంది వికలాంగులు, 11,470 మంది అభయహస్తం, 6375 మంది డప్పు కళాకారులు, 5747 మంది ఒంటరి మహిళలు, తదితర వర్గాలకు చెందిన వారు ఉన్నారు.

బాల కార్మిక రహిత జిల్లానే లక్ష్యం

చిత్తూరు కలెక్టరేట్, జూలై 31: బాల కార్మికుల రహిత జిల్లాగా చిత్తూరును తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని డీఆర్వో పుల్లయ్య అన్నారు. బుధవారం జిల్లా కార్మిక శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన డీఆర్వో మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాలబాలికలను పనిలో పెట్టుకుంటే క్రిమినల్ కేసుతో పాటు జరిమానా ఉంటాయని తెలిపారు. బాలకార్మికులు పనిచేస్తున్నట్లు తేలితే 1098కి కాల్‌చేసి తెలియజేయాలన్నారు. గురువారం నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఈవో దేవరాజులు, జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ ఓంకార్, చైల్డ్ హెల్ప్‌లైన్ కో-ఆర్డినేటర్, నాగమణి, పిల్లల సంరక్షణ అధికారి శివ, సహాయ కార్మిక అధికారి మధుబాబు పాల్గొన్నారు.

పెద్దూరు సర్పంచి చెక్ పవర్ రద్దు

రామకుప్పం, జూలై 31: రామకుప్పం మండలం 89పెద్దూరు పంచాయతీ సర్పంచి మల్లిక చెక్‌పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మి ఆదేశాలు జారీ చేశారు. పంచాయతీలో ఈమె అందుబాటులో లేకపోవడం వల్ల తాగునీరు, వీధిదీపాలు, పారిశుధ్య సమస్యలతో తాము ఇబ్బందులు పడుతున్నట్టు జూలై 18న పలువురు గ్రామస్థులు జిల్లా అధికారులకు పిర్యాదు చేశారు. పంచాయతీ కార్యదర్శి కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వారు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచు మల్లికపై తగు చర్యలు తీసుకుని, నిధులు డ్రా చేసే అధికారాన్ని నిషేధించాలని కోరారు. దీనిపై విస్తరాణాధికారి నివేదిక మేరకు సర్పంచుకు నిధులు డ్రా చేసే అధికారం నుంచి తప్పించినట్టు డీపీవో తమ అదేశాల్లో పేర్కొన్నారు. కుప్పం ఉపఖజానా అధికారి, వి.కోట స్టేట్‌బ్యాంకుతోపాటు ఇతర బ్యాంకుల వారు 89పెద్దూరు పంచాయతీకి సంబంధించి నిధుల విషయంలో కలెక్టరు జారీ చేసే చెక్కులను మాత్రమే అనుమతించాలని ఆ ఆదేశాల్లో ఆమె పేర్కొన్నారు.

ఖాళీ బిందెలతో మహిళల ధర్నా



పుంగనూరు రూరల్, జూలై 31: తాగునీటి సమస్య పరిష్కరించాలని పుంగనూరు టిట్కో ఇళ్ల మహిళలు ఖాళీబిందెలతో బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ 15 రోజులుగా తాగునీరు రావడం లేదని, తాము కూలీ పనులకు వెళ్లి సంపాదించిన డబ్బుతో తాగునీరు కొనుగోలు చేస్తున్నట్లు వాపోయారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఘటనా స్థలానికి మున్సిపల్ అధికారులు, సిబ్బందిని పంపించి పైపుల మరమ్మతు పనులు చేపట్టి తాగునీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నారు. దీంతో కాలనీ వాసులు కమిషనర్‌ను అభినందించారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ఆయన కోరారు.

రైతులు ఆధునిక పద్ధతులు అలవర్చుకోవాలి : కలెక్టరు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు సుమిత్‌కుమార్

రామకుప్పం, జూలై 31: రైతులు పంటల సాగులో ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలవర్చుకుని లాభాల బాటలో పయనించాలని కలెక్టరు సుమిత్‌కుమార్, కడా పీవో వికాస్‌మర్మత్ కోరారు. బుధవారం రామకుప్పంలో ఉద్యానరంగంలో విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటు, అధునిక వ్యవసాయ పద్ధతులపై రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో రైతులకు పంటల సాగులో ఆధునిక పద్ధతులు, ప్రభుత్వ ప్రోత్సాహలను, బ్యాంకు రుణాలు పొందడం, మంచి మార్కెటింగ్ సౌకర్యం వంటి వాటిపై అవగాహన ఎంతో అవసరమన్నారు. ఈ ప్రాంతంలో రైతులు 18రకాల ఉద్యానపంటలు, 12రకాల వాణిజ్య పంటలను సాగు చేస్తున్నారన్నారు ఆగస్టు 10న కుప్పం కడా కార్యాలయంలో పీడీ అందుబాటులో ఉంటారన్నారు. బ్యాంకు రుణాలు, ప్రస్తుతం చేస్తున్న వృత్తి వివరాలు, ఆదాయమార్గాలు, ఏ ప్రాజెక్టు ద్వారా అభివృద్ధి చెందాలనుకుంటున్నారో వంటి వివరాలను రైతులు స్వయంగా అందించాలని వారు కోరారు. కుప్పంలో పండించే పండ్లు, కూరగాయాల ప్రాసెసింగ్, ప్రాసెస్‌ల మార్కెటింగ్ వంటి అంశాలపై పరిశీలిస్తామని వారు తెలిపారు. చిన్నతరహా పరిశ్రమల ప్రోత్సాహక, అభివృద్ధి సంస్థ పీడీ శ్రీనివాసులు చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటు, బ్యాంకు రుణాలు పొందడం, పారిశ్రామిక, సాంకేతిక సలహాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా అందించే రుణాలను గూర్చి రైతులకు వివరించారు. ఈ సమావేశంలో లీడ్‌బ్యాంకు మేనేజర్ హరీష్, ఉద్యానశాఖ జిల్లా అధికారి మధుసూదన్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ బాలసుబ్రహ్మణ్యం, హార్టికల్చర్ ఏడీ కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, టీడీపీ కుప్పం ఇన్‌చార్జి మునిరత్నం, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాగభూషణం, నియోజక, మండల అధ్యక్షులు చలపతి, కొళ్ళపల్లెబాబు, టీడీపీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చిన్నికృష్ణ, ఏఎంపీ మాజీ చైర్మెన్, వైస్‌చెర్మన్లు సత్యేంద్రశేఖర్, సీతాపతి, బీజే పీ జిల్లా కార్యదర్శి రాజసింహ, జనసేన మండల అధ్యక్షుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించని టెండర్‌దారులపై చీటింగ్ కేసు పెట్టాలి

మున్సిపల్ మీట్‌లో కౌన్సిలర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా

పుంగనూరు, జూలై31: వైసీపీకి చెందిన వ్యక్తులు మున్సిపాలిటీలో వివిధరంగాల్లో వేలం పాటల ద్వారా టెండర్లు పొంది సొమ్ము చెల్లించకుండా మోసం చేసిన వారిపై చీటింగ్ కేసులు పెట్టి రికవరీ చేయాలని కౌన్సిలర్ ఎం.రామకృష్ణమరాజు డిమాండ్ చేశారు. బుధవారం మున్సిపల్ ఛైర్మన్ ఎస్.అలీంబాషా అధ్యక్షతన కౌన్సిల్ మీట్ జరిగింది. ఈ సందర్భంగా రామకృష్ణమరాజు మాట్లాడుతూ వేలం పాటల ద్వారా పన్నులు వసూలు చేసి బకాయి ఉన్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ఉద్యోగులు బకాయిదారులకు సహకరించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పన్నులు వసూలు చేసి ప్రభుత్వానికి చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారని మండిపడ్డారు. కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే బకాయిదారులకు నోటీసులు అందజేశామని, ఇటీవల రూ.8లక్షలు వసూలైందని, దీనిపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. పట్టణంలో ప్రభుత్వ భూములు, కాల్వల ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఛైర్మన్ అలీంబాషా మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి సహకారంతో పుంగనూరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అజెండాలోని అన్ని అంశాలను ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు కౌన్సిలర్లు తెలిపారు. కాగా వైసీపీకి చెందిన ఛైర్మన్‌తోసహా 13మంది ఇటీవల వైసీపీకి రాజీనామా చేసి చల్లా రామచంద్రారెడ్డిని కలిసి టీడీపీలో చేరనున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కౌన్సిల్ మీట్‌కు వైసీపీ సభ్యులంతా గైర్హాజరయ్యారు. సమావేశంలో కౌన్సిలర్లు అమ్ము, మనోహర్, నరసింహులు, మమత, నయింతాజ్ తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో కలెక్టర్‌కు 83 ఫిర్యాదులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, కడా పీడీ తదితరులు

కుప్పం, జూలై 31: కుప్పంలో బుధవారం కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. స్థానిక మండల సచివాలయంలో ఉదయం 10 గంటలనుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించిన ఈ వేదికలో వివిధ ప్రభుత్వ విభాగాలకు చెందిన సమస్యలపై మొత్తం 83 పిర్యాదులు ప్రజలనుంచి అందాయి. ఇందులో రెవెన్యూ సంబంధిత పిర్యాదులు మాత్రమే ఏకంగా 62 ఉండడం గమనార్హం. ఇవిగాక హౌసింగ్ 6, పశు సంవర్ధక శాఖ 4, బీసీ కార్పొరేషన్ 3, ఐసీడీఎస్, ద్రావిడ విశ్వవిద్యాలయం రెండేసి, డీఎస్పీ, పోలీసు, స్కిల్ డెవలప్‌మెంట్, మండల పరిషత్తు, తపాలా శాఖలకు సంబంధించి ఒక్కో ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి అందిన ప్రతి ఫిర్యాదుకూ సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. వారం రోజుల్లోగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆయా విభాగాల అధికారులను అదేశించారు. ఈ కార్యక్రమంలో కడా పీడీ వికాస్ మర్మత్, ఆర్డీవో జి.శ్రీనివాసులుతోపాటు నియోజకవర్గంలోని ఎంపీడీవోలు, తహశీల్దార్లు, వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకుడిగా కొనసాగించండి

నాడు ఈవో ధర్మారెడ్డి ఏకపక్షంగా తొలగించారు

హైకోర్టులో ఏవీ రమణ దీక్షితులు పిటిషన్

కౌంటర్ దాఖలుకు దేవదాయ ముఖ్యకార్యదర్శి, టీటీడీ ఈవోకు హైకోర్టు ఆదేశాలు

అమరావతి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఏవీ రమణదీక్షితులు దాఖలు చేసిన పిటిషన్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న దేవదాయశాఖ ముఖ్యకార్యదర్శికి, టీటీడీ ఈవోకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగువారాలకు వాయిదావేస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుమల శ్రీవారి ఆలయం ప్రధాన అర్చకుడి బాధ్యతల నుంచి తప్పిస్తూ ఈ ఏడాది మార్చి 2న అప్పటి టీటీడీ ఈవో ధర్మారెడ్డి జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను ఏవీ రమణదీక్షితులు హైకోర్టులో సవాల్ చేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది శీతిరాజు శ్యాంసుందర్ వాదనలు వినిపించారు. "పిటిషనర్‌కు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ఏకపక్షంగా తొలగించారు. సహజ న్యాయసూత్రాలకు విరుద్ధంగా టీటీడీ ఈవో అప్పట్లో వ్యవహరించారు. ఈవో ప్రొసీడింగ్స్‌ను రద్దు చేసి రమణ దీక్షితులు ప్రధాన అర్చకుడిగా కొనసాగేలా ఆదేశాలు ఇవ్వాలి" అని అభ్యర్థించారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి, ప్రతివాదులకు నోటీసులు జారీ చేశారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, జూలై 31: ప్రజలు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాలని ఎస్పీ మణికంఠ ఆదేశించారు. బుధవారం పోలీసు ట్రైనింగ్ సెంటర్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రధాన కూడళ్ల వద్ద, అపార్టుమెంట్లలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. పెండింగ్ గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు మరింత తగ్గే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి, మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. నేర ఛేదనలో, ప్రాపర్టీ రికవరీలో ప్రతిభ కనబరిచిన అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీ అరీఫుల్లా, సెబ్ ఏఎస్పీ సుబ్బారావు, ఏఆర్ ఏఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.